ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య జిల్లా వార్తలు
5
బుధవారం 16 ఏప్రిల్ 2025





వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్



ఉమ్మడి జిల్లాలో రెవెన్యూ ఉద్యోగులకు పనిభారం పెరుగుతోంది. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రతి పనిని చక్కబెట్టాల్సిన తహశీల్దార్లు తగినంత మంది లేక ఇన్‌చార్జిలతో పాలన సాగుతోంది. ఫలితంగా ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా సమర్థవంతంగా నిర్ణయాలు తీసుకునే తహశీల్దార్లు లేరు. దీంతో కడప, అన్నమయ్య జిల్లాల్లో రెవెన్యూలో పాలన గాడి తప్పిందని విమర్శలు వినిపిస్తున్నాయి.



పాలన సాగేదెలా..?

- ఉమ్మడి జిల్లాలో 20 మంది తహశీల్దార్ల కొరత
- అన్నమయ్యలో 15 మంది, కడపలో ఐదుగురు
- ఫిర్యాదుల పరిష్కారంలో సతమతమవుతున్న వైనం
- పేరుకు పోయిన ఫైళ్లు, ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మనిషి పుట్టుక నుంచి చనిపోయేంత వరకు రకరకాల సర్టిఫికెట్లు జారీ చేయడం మొదలు సమస్యలున్న భూముల రీసర్వే, రెవెన్యూ సదస్సులు, ప్రభుత్వ పథకాల అమలు, జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో ప్రోటోకాల్‌తో పాటు కోర్టు కేసులు చూడాల్సిన బాధ్యత తహశీల్దార్లదే. ఇంతటి కీలకపాత్ర పోషించే తహశీల్దార్లు 20 మంది కొరత ఏర్పడింది. దీంతో ఇన్‌చార్జి తహశీల్దార్లు పాలన సాగడంతో నెలల తరబడి ఫైళ్లు పరిష్కారానికి నోచుకోక పేరుకుపోతున్నాయి.

20 మంది తహశీల్దార్ల కొరత

2022 ఏప్రిల్ 2వ తేదీన జిల్లాల పునర్విభజన జరిగింది. అందులో భాగంగా కడప జిల్లాలో అంతర్భాగమైన రాయచోటి కేంద్రంగా రాజంపేట, రైల్వేకోడూరు, మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు అసెంబ్లీ నియోజకవర్గాలు కలిపి అన్నమయ్య జిల్లా ఏర్పడింది. జిల్లా కేంద్రమైన రాయచోటిలో కలెక్టరేట్, మిగతా శాఖలను నూతనంగా ఏర్పాటు చేశారు. ఆ భవనాల్లో సరైన మౌలిక వసతులతో పాటు సిబ్బందిని నియమించే విషయంలో అప్పటి వైసీపీ సర్కారు సరైన నిర్ణయాలు తీసుకోకపోవడంతో ఇప్పుడు రెవెన్యూ ఉద్యోగులకు పనిభారం పెరుగుతోంది. నూతనంగా కలెక్టరేట్, ఇతర శాఖల నుంచి అధికారులు, సిబ్బందిని సమకూర్చే విషయంలో కడప, చిత్తూరు జిల్లాల్లో కీలక శాఖల్లో పనిచేసే సిబ్బందిని సగానికి పైగా ఇక్కడకు మార్చారు. దీంతో సేవలు సమస్యల పరిష్కార విషయంలో సగం-సగం అన్నట్లుగా పెండింగ్‌ల మీద పెండింగ్‌లు పెడుతూ ప్రజలకు తిప్పలు తెస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలతో క్షేత్రస్థాయిలో మమేకమై ఉండే రెవెన్యూశాఖలో అన్నమయ్య జిల్లాలో 15 మండలాలకు తహశీల్దార్లు లేకపోవడంతో ఇప్పటికీ ఇన్‌చార్జిలే సేవలు అందిస్తున్నారు. అందులో పెనగలూరు, రాజంపేట, పుల్లంపేట, రామాపురం, చిట్వేలి మండలాలతో పాటు మరో 10 మండలాల్లో ఇన్‌చార్జి తహశీల్దార్లే దిక్కయ్యారు. కడప జిల్లాలో సైతం 5 మండలాలకు తహశీల్దార్లు లేక ఇన్‌చార్జిల పాలన సాగుతోంది. అందులో గోపవరం, సిద్దవటం, ముద్దనూరు, జమ్మలమడుగు, ఆర్డీవో కార్యాలయాలున్నాయి.

పనిభారం పెరగడంతో అనారోగ్యం ముప్పు?

జిల్లాల పునర్విభజన తరువాత అన్నమయ్య, కడప జిల్లాల్లో చాలినంత సిబ్బంది, అధికారులు లేరు. సగం మంది మాత్రమే సిబ్బంది ఉండటంతో వీరిపై పనిభారం రెట్టింపయింది. రెండు జిల్లాల్లో విపరీతమైన ఒత్తిడి మధ్య సిబ్బంది అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. నెలలో కొన్ని రోజులు రేయింబవళ్లు పనిచేయడంతో మూడొంతుల మంది బీపీ, షుగర్ వ్యాధుల బారిన పడ్డట్లు వాపోతున్నారు. ఇలాగే పనిభారం ఉంటే హార్ట్ అటాక్‌లు తప్పవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2022లో జిల్లాల పునర్విభజన జీవో వచ్చినప్పటి నుంచి తమకు తిప్పలు తప్పడం లేదని అంటున్నారు. కాగా కడప కలెక్టరేట్‌లో 10 సెక్షన్లలో సూపరింటెండెంట్లు ప్రజలకు సకాలంలో సేవలందించే వారు. కడప నుంచి విడిపోయి అన్నమయ్య జిల్లా ఏర్పాటు జరగడంతో కలెక్టరేట్‌లోని సిబ్బంది పక్క జిల్లాకు సర్దుబాటు చేశారు. దీంతో కడప కలెక్టరేట్‌లో ఉన్న 10 సెక్షన్లను 4 సెక్షన్లుగా మార్చు చేశారు. ఒక్కొక్క సూపరింటెండెంట్ పరిధిలో 2, 3 సెక్షన్లు కలపడంతో, అధికారులు అడిగిన వెంటనే సమాచారం చేరవేయడం తలకుమించిన భారంగా మారిందని అంటున్నారు. ఇదే పరిస్థితి అన్నమయ్య జిల్లాలో సిబ్బందికీ తప్పలేదు.



పదోన్నతుల కోసం పడిగాపులు

కొత్త జిల్లాలు ఏర్పడడంతో రెవెన్యూలో జోన్-4 పరిధిలో సీనియర్ డిప్యూటీ తహశీల్దార్లు, ప్రొహిబిషన్ డిప్యూటీ తహశీల్దార్ల మధ్య పదోన్నతుల విషయంలో ప్రచ్ఛన్న యుద్ధం జరుగుతోంది. పదోన్నతుల వివాదం రేగడంతో జోన్-1కు చెందిన 2018 నాటి పీడీటీలు కోర్టులో అమీతుమీ తేల్చుకోనేందుకు సిద్ధమయ్యారు. దీంతో ర్యాంకర్స్ వర్సెస్ పీడీటీల మధ్య కోర్టులో వార్ ఇప్పట్లో తెగడం అసాధ్యమంటున్నారు. వీరిమధ్య రాజీ కుదిరితే తప్ప పదోన్నతులు అసాధ్యమంటారు. ఇలాంటి సమయంలో డిప్యూటీ తహశీల్దార్లకు ఈ రెండు జిల్లాల్లో మరింత డిమాండ్ పెరిగిందంటారు. ఖాళీగా ఉన్న మండలాలకు తహశీల్దార్ల నియామకాల విషయంలో రాజకీయ పలుకుబడి ఉన్న డిప్యూటీ తహశీల్దార్లు ఈ రెండు జిల్లాల్లో ఇన్‌చార్జి తహశీల్దార్లుగా పోస్టింగ్‌లు దక్కించుకుని చక్రం తిప్పుతుండడం గమనార్హం. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకుని రెగ్యులర్ తహశీల్దార్లను నియమించాలని రెవెన్యూ ఉద్యోగులతో పాటు ప్రజలూ కోరుతున్నారు.

గ్రామ ఉత్కర్ష అభియాన్ పక్కాగా అమలవ్వాలి

- జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): దార్తి ఆబ జన్‌జాతియ గ్రామ ఉత్కర్ష అభియాన్ కార్యక్రమాన్ని గిరిజనులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పక్కాగా అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయంతో నిర్వహించబడే ఈ కార్యక్రమంపై జిల్లా గిరిజన సంక్షేమశాఖ, హౌసింగ్, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరాల శాఖ, విద్యుత్, వైద్య ఆరోగ్యశాఖ తదితర శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి సురేశ్ సమావేశాన్ని ప్రారంభిస్తూ జిల్లాలో నాలుగు మండలాల్లోని 17 గ్రామాలు ఈ కార్యక్రమం కింద ఎంపికయ్యాయని, ఈ గ్రామాల్లో 50 శాతం పైబడి జనాభా గిరిజనులు ఉన్నట్లుగా వివరించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులు 50 శాతంపైగా ఉన్న గ్రామాలపై దృష్టి సారించారని పార్టీ అభివృద్ధికి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కమిటీ, మండల స్థాయి కమిటీలు ఎప్పటికప్పుడు ఈ కార్యక్రమాలపై సమీక్ష సమావేశాలను నిర్వహించుకొని సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొన్ని గ్రామాల్లో కొంత మంది లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అమలవ్వని పక్షంలో వారందరికీ సహాయ సహకారాలు అందించి సంక్షేమ, అభివృద్ధి ఫలాలను వారికి అందజేయాలన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డులు, గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద లబ్ధిదారులకు ఇచ్చే కార్డులు అందని వారికి అందేలా చేయాలన్నారు. కిసాన్ సమాన్ నిధి పథకానికి సంబంధించిన లబ్ధిదారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించి గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీలకు పనికల్పించాలి

- డ్వామా పీడీ వెంకటరత్నం



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటరత్నం

సంబేపల్లె, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో ఎక్కువ మంది కూలీలకు పని కల్పించాలని డ్వామా పీడీ వెంకటరత్నం ఆదేశించారు. మంగళవారం సంబేపల్లె మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబేపల్లె మండలంలో ప్రతిరోజు 4,020 మంది కూలీలు పనిచేసేలా చూడాలన్నారు. ప్రస్తుతం 3,408 మంది కూలీలు పనిచేస్తున్నట్లు తెలిపారు. నీటి నిల్వలు చేపట్టేందుకు విరివిగా ఫారంపాండు గుంతల పనుల్లో 40 శాతం కూలీలు ఉండేలా చూడాలని అధికారులకు తెలిపారు. పశువుల నీటి తొట్లు, గోకులాలు నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలన్నారు. మండలంలో 412 కాంపోండ్ గుంతలు మంజూరు చేశామని, 374 చోట్ల పనులు జరుగుతున్నట్లు తెలియజేశారు. ఇందులో 64 ఫారంపాండు గుంతలు పూర్తి చేసినట్లు తెలిపారు. 5 ఎకరాల్లోపు ఉన్న పాడి రైతులకు అరెకరం పొలంలో గడ్డి సాగు కోసం ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్ర, ఏపీడీ మధుబాబు, ఏపీవో షేక్ రెడ్డిజవహర్, ఉపాధి హామీ జేఈ, టీఏలు తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ పీజీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం



పీజీ పరీక్షలను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ పద్మ, సీఈ కృష్ణారావు తదితరులు

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం పోస్టుగ్రాడ్యుయేషన్ (ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ, ఎంపీఈడీ, ఎంసీఏ) నాలుగో సెమిస్టర్, ఎంఎస్సీ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ పరీక్షలు మంగళవారం విశ్వవిద్యాలయ ఏపీజే అబ్దుల్ కలాం గ్రంథాలయ భవనంలో ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలను రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఆచార్య కేఎస్వీ కృష్ణారావుతో కలిసి తనిఖీ చేశారు. పలువురు విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. పరీక్షల సూపరింటెండెంట్ ఆచార్య కాత్యాయని మాట్లాడుతూ 543 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని ఒకరు మాత్రమే గైర్హాజరయ్యారని తెలిపారు. నిర్వహణకు అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని వివరించారు. పరీక్ష కేంద్రం అబ్జర్వర్లు డాక్టర్ ప్రమీల మార్గరేట్, డాక్టర్ రాఘవేంద్ర పరీక్షల కేంద్రాన్ని పరిశీలించారు.

యువకుడి దారుణ హత్య 6



మత్తు పదార్థాల నివారణే లక్ష్యం

- అదనపు ఎస్పీ వెంకటాద్రి



మాదకద్రవ్యాల నివారణపై ఈగల్ టీం సభ్యులతో సమావేశమైన అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల నివారణే లక్ష్యంగా ఈగల్ టీం చర్యలు ఉంటాయని జిల్లాలో ప్రత్యేక వ్యూహాలు ప్రణాళిక ద్వారా మత్తు పదార్థాల కట్టడికి చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి పేర్కొన్నారు. మంగళవారం ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, ఈగల్ టీం సభ్యులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్రంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు ఏర్పాటు చేసిన ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈగల్) ద్వారా ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో మాదక ద్రవ్యాల సమస్యను సమర్థవంతంగా తీసుకుంటుందన్నారు. ముఖ్యంగా మాదక ద్రవ్యాల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థులు, యువతను మాదక ద్రవ్యాల బారిన పడకుండా రక్షించడం, మాదక ద్రవ్యాల కేసులు దర్యాప్తు, ప్రాసిక్యూషన్ వేగవంతం చేయడం లాంటి కార్యక్రమాలను జిల్లాలో విస్తృతం చేయడం జరుగుతుందన్నారు. ప్రధానంగా పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం, టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ 1972 ద్వారా సమాచారం సేకరించడం, మాదక ద్రవ్యాల బారిన పడిన వారికి పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడం ఈగల్ టీం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ముఖ్యంగా జిల్లాలో డాక్టర్ రసీదు లేకుండా మందులు ఇస్తే మెడికల్ స్టోర్‌లపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మాదక ద్రవ్యాల నివారణలో భాగంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కోసం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో కె.సుబ్రమణ్యం, డీఎంఅండ్‌హెచ్‌వో ఉషశ్రీ, రాయచోటి జైల్స్ సూపరింటెండెంట్ ఉమామహేశ్వరరావు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్వీ కృష్ణకిశోర్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ జయరాముడు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్, జిల్లా పంచాయతీ అధికారి మస్తాన్‌వలి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ తులసిరామ్, సైబర్ సెల్ సబ్ ఇన్‌స్పెక్టర్ చిరంజీవి, ఈగల్ సెల్ మెంబర్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా పుష్పయాగం



పుష్పయాగానికి పూలను తీసుకువస్తున్న టీటీడీ సిబ్బంది, అర్చకులు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా అయోధ్యగా పేరుగాంచిన ఒంటిమిట్ట కోదండరామ స్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం పుష్పయాగం కనులపండువగా నిర్వహించారు. కోదండరామ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం సాయంత్రం ధ్వజావరోహణతో ముగిశాయి. బ్రహ్మోత్సవాల్లో గాని, నిత్యకైంకర్యాల్లో తెలిసీతెలియక ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా మంగళవారం సుప్రభాతంతో స్వామి వారిని మేలుకొలిపి ఆలయ శుద్ధి ఆరాధన చేశారు. సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం ప్రారంభించారు. తులసిదలాలు, చామంతి, రోజా, మల్లెలు, సంపంగి తదితర పుష్పాలు, పత్రాలతో సీతాలక్ష్మణ సమేత కోదండరాముడికి నీరాజనాలు సమర్పించారు. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి సుమారు 2.5 టన్నుల పుష్పాలు భక్తులు విరాళంగా అందజేశారు. యాగం నిర్వహణ వల్ల సకల దోషాలు తొలగిపోతాయని కంకణబట్టర్ రాజేశ్ కుమార్ తెలిపారు. బ్రహ్మోత్సవాల అనంతరం పుష్పయాగం, ఏకాంతసేవ నిర్వహించడంతో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి కనులారా వీక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, సిబ్బంది హనుమంతయ్య, నవీన్, ఆలయ అర్చకులు, వీణా రాఘవాచార్యులు, శ్రావణ్‌కుమార్, మనోజ్‌కుమార్, పవన్‌కుమార్, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పుష్పయాగాన్ని వీక్షిస్తున్న భక్తులు





సీతాలక్ష్మణ సమేత కోదండరాముడికి పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

పీలేరు కళాకారుడికి కందుకూరి విశిష్ట పురస్కారం



కందుకూరి విశిష్ట పురస్కారం లభించిన షేక్ ఖాదర్‌బాషా

పీలేరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పీలేరుకు చెందిన ప్రముఖ కళాకారుడు, బహుబాషా నటుడు, సామాజిక సేవా కార్యకర్త షేక్.ఖాదర్‌బాషాకు కందుకూరి విశిష్ట పురస్కారం లభించింది. నాటక రంగంలో అత్యుత్తమ సేవలందిస్తున్న కళాకారులు, సాంకేతిక నిపుణులు, రచయితలు, దర్శకులకు రాష్ట్ర ఫిలిం, టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మంగళవారం ప్రకటించిన కందుకూరి విశిష్ట పురస్కారాలలో ఖాదర్‌బాషాకు జిల్లా స్థాయి పురస్కారం లభించింది. పీలేరుకు చెందిన ఈయన గత 37 ఏళ్లుగా తెలుగు, హిందీ, కన్నడ సాంఘిక, పౌరాణిక, జానపద నాటికలు, టీవీ సీరియళ్లు, సినిమాల్లో విభిన్న పాత్రలు పోషించడమే కాకుండా దర్శకత్వ బాధ్యతలు కూడా నిర్వర్తించారు. అంతరాష్ట్ర కళా పోటీల్లోనే కాకుండా జాతీయ, అంతర్జాతీయ వేదికలపై కూడా నాటకాలు ప్రదర్శించారు. 2 వేలకు పైగా ఆధునిక వీధి నాటకాలు, జాతీయ స్థాయిలో 2500కు పైగా సాంఘిక నాటకాలు, విదేశాల్లో 25కు పైగా కన్నడ, హిందీ నాటక ప్రదర్శనలు చేశారు. రేడియో, దూరదర్శన్, ప్రైవేటు ఛానళ్లలో 60కి పైగా ప్రదర్శనలు చేశారు. అమెరికా, జపాన్, సింగపూర్, కువైట్, ఖతార్, మస్కట్, బెహ్రీన్ వంటి దేశాల్లోనూ పలు నాటకాలు ప్రదర్శించారు. నాటక రంగంలో ఆయన సేవలను గుర్తించి గతంలో అనేక సంస్థలు ఆయనకు నేతాజీ సుభాష్ చంద్రబోస్ నేషనల్ ఐకాన్ అవార్డు, సర్వేపల్లె రాధాకృష్ణన్ ఎక్సలెన్సీ అవార్డు, సర్దార్ వల్లభాయ్ పటేల్ లెజండరీ అవార్డు, ఎన్‌టీఆర్ లెజండరీ అవార్డు, ఏపీజే అబ్దుల్ కలాం జీవన సాఫల్య పురస్కారం అందించారు. కందుకూరి విశిష్ట పురస్కారం లభించడం పట్ల ఖాదర్‌బాషా హర్షం వ్యక్తం చేశారు. పలువురు ఆయనను అభినందించారు.

నేడు ఎంపీడీవోలతో జడ్పీ చైర్మన్ భేటీ

కడప రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): జడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి మంగళవారం కడపలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోలతో సమావేశం కానున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు జడ్పీ చైర్మన్ జిల్లా సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తారని ఆయా మండలాల ఎంపీడీవోలు తప్పకుండా హాజరు కావాలని జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ సర్క్యులర్ ద్వారా సూచించారు. కొనసాగుతున్న జడ్పీ పనులు, అభివృద్ధి కార్యక్రమాలు, తాగు నీటి పైపులైన్లు తదితర వాటిపై సమీక్ష ఉంటుందని పేర్కొన్నారు. అయితే టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత జడ్పీలో మరో రెండు నెలల్లో రెండవసారి సాధారణ బదిలీలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎంపీడీవోలతో జడ్పీ చైర్మన్ భేటీ కానుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.

రైలుకింద పడి వ్యక్తి మృతి



సిద్దయ్య (ఫైల్)

నందలూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నందలూరు రైల్వే కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం సుమారు 2.10 గంటల సమయంలో కల్లగొట్ల సిద్దయ్య(45) అనేవ్యక్తి గూడ్సు రైలు కింద పడి మృతిచెందారు. ఈ సంఘటనపై జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ సుభాన్ మాట్లాడుతూ మహబూబ్ నగర్ వీధి, రంగసముద్రం, పోరుమామిళ్ల ప్రాంతానికి చెందిన సిద్దయ్య రైలు కింద పడి మృతిచెందారన్నారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప పట్టణంలోని రిమ్స్‌కు తరలించారు.

ఓబులవారిపల్లెలో: మండల పరిధిలోని ముక్కావారిపల్లె గ్రామ పంచాయతీలోని తురకపల్లెకు చెందిన షేక్ అహ్మద్‌అలీ(40) ప్రమాదవశాత్తు రైలుకింద పడి మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. వివరాల్లోకి వెళితే... తురకపల్లె గ్రామానికి చెందిన షేక్ అహ్మద్‌అలీ బేల్దారి పనులు చేసుకుంటూ జీవించేవాడు. ఇతనికి భార్య మౌలాని, ఏడుగురు సంతానం, వీరిలో ఇద్దరు ఆడబిడ్డలు, ఐదుగురు మగపిల్లలు. కుటుంబ పోషణ, ఆర్థిక సమస్యలతో సతమతమయ్యేవాడు. ఓబులవారిపల్లెలో బంధువుల ఇంటికి వెళ్లే క్రమంలో రైల్వేస్టేషన్ పరిధిలో ప్రమాదవశాత్తు రైలుకిందపడి మృతిచెందినట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నాటుసారా తయారు చేస్తున్న మహిళ అరెస్టు

మదనపల్లెటౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారు చేస్తున్న ఓ మహిళను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం సాయంత్రం మదనపల్లె ఎక్సైజ్ సీఐ భీమలింగ ఆధ్వర్యంలో దాదినాయనితాండా అటవీప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. నాటుసారా తయారు చేస్తున్న బుక్కే సురేష్ భార్య సవిత(19)ను అదుపులోకి తీసుకుని 52 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు పారిపోయిన సురేష్‌నాయక్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ జబీవుల్లా, పీసీలు నాగరాజు, మధు, రేఖ పాల్గొన్నారు.

కొడుకుపై తండ్రి కత్తితో దాడి

రైల్వేకోడూరురూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీవీ కండ్రిక పంచాయతీ పరిధిలోని పిట్లవారిపల్లిలో సోమవారం అర్ధరాత్రి మద్యం మత్తులో తండ్రి కొడుకుపై దాడి చేశాడు. పోలీసుల వివరాల మేరకు... పిట్లవారిపల్లికి చెందిన చింతల వెంకటయ్య అనే వ్యక్తి మద్యం మత్తులో తన భార్యతో గొడవ పడుతుండగా కొడుకు చింతల శివ తండ్రిపై ఘర్షణ పడ్డాడు. ఈ ఘర్షణలో వెంకటయ్య శివపై కత్తితో దాడి చేయడంతో శివ తీవ్రంగా గాయపడ్డాడు. బంధువులు వెంటనే శివను రైల్వేకోడూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో క్షతగాత్రుడిని తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు రైల్వేకోడూరు సీఐ హేమసుందర్ తెలిపారు.

కురబలకోట యువకుడు మృతి

కురబలకోట, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): తిరుమలలో జరిగిన గొడవలో కురబలకోట మండలానికి చెందిన యువకుడు మృతి చెందాడు. మండలంలోని నాయనవారిపల్లెకు చెందిన వెంకటశివ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. రెండు రోజుల క్రితం రాంభగీచా వద్ద వాహనాన్ని నిలుపగా తిరుపతికి చెందిన ముగ్గురు డ్రైవర్లు అతనితో గొడవపడ్డారు. వారు రాయితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన వెంకటశివను తిరుపతికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

సస్యరక్షణ పరికరాలు పంపిణీ



రైతులకు వేయింగ్ మిషన్ పంపిణీ చేస్తున్న ఏడీ నాగరాజు

సిద్దవటం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రైతులకు 50 శాతం సబ్సిడీపై సస్యరక్షణ పరికరాలు పంపిణీ చేసినట్లు బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు తెలిపారు. సిద్దవటం వ్యవసాయశాఖ కార్యాలయంలో వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రైతుసేవా కేంద్రాల వ్యవసాయశాఖ సహాయకులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర కేంద్రీయ ఉత్పత్తుల ధ్రువీకరణ అథారిటీ ప్రతినిధి వంశీ, శివఫణీంద్ర, రైతుసేవా కేంద్రాల వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రారంభమైన మామిడి కోతలు

- రైతులకు అనుకూలంగా ధరలు
- తోటల నుంచే ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు



రైల్వేకోడూరు మామిడి యార్డులో ట్రేల్లో ఉంచిన పులిహోర కాయలు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలో మామిడి కోతలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం రైతులకు మామిడి ధరలు అనుకూలంగా ఉండడంతో తోటల నుంచే ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి మాసంలో మామిడి పూతలు అనుకున్న స్థాయి కంటే ఎక్కువగా రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జనవరి ఆఖరిలో పూతలు ఉన్న సమయంలో వర్షం పడింది. వచ్చిన పూతంతా మగ్గి రాలిపోయింది. దీంతో ఈ ఏడాది 15 శాతం మాత్రమే పూత నిలవడంతో మామిడి పూతలు, పిందెలు, కాయలు నిలవడానికి ఈ ఏడాది రైతులు చాలా కష్టాలే పడ్డారు. కొందరు రసాయనిక ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా పిచికారి చేశారు. చాలా మంది రైతులు ఆర్గానిక్ పరంగా ఉన్న పశువుల ఎరువు, పులిసిన మజ్జిగ, వేప నూనె తదితర వాటిని పిచికారి చేశారు. దీంతో ఆశించిన దిగుబడి సాధించారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులను వాడిన వారి సక్రమంగా పూతలు, కాయలు నిలువకుండా పోయాయని పలువురు రైతులు చెబుతున్నారు. ఈ సారి మామిడికి బూడిద, తేనె మంచు, పండు ఈగ తదితర రకాల తెగుళ్లు ఆశించాయి. దీనికి మందులు ఉపయోగించాల్సి వచ్చింది. ఒక రైతు రెండు సార్లు మాత్రమే గతంలో మందులను పిచికారి చేయాల్సి వచ్చేది. ఈ ఏడాదిలో నాలుగు సార్లు మందులను పిచికారి చేయాల్సి వచ్చింది. ఎకరాకు కూలీలు, దున్నకాలు, మందులు తదితర వాటికి రూ.20 నుంచి రూ.25 వేల వరకు ఖర్చు అయిందని రైతులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా మామిడికి వాతావరణ పరిస్థితులు కూడా పెద్దగా అనుకూలించలేదు. దీంతో చాలా మంది రైతుల తోటల్లో కాపు రాలేదు.

రైల్వేకోడూరు, పెనగలూరు, పుల్లంపేట, ఓబులవారిపల్లె, చిట్వేలి మండలాల్లో తోతాపూరి, పులిహోరా, కాలేపాడు, మల్లిక, ఖాదర్, బేనీషా, రసాలు, మాల్గోవా, నూనెపసందు, చెఱకురసం, నీలం, రుమాణి తదితర రకాలను రైతులు పండిస్తున్నారు. మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, జైపూర్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలకు కాయలను ఎగుమతి చేస్తున్నారు. రైల్వేకోడూరు మామిడి యార్డులో సుమారు రూ.100 కోట్లకు పైగా వ్యాపారం సాగుతుంది. 2 వేల మంది కూలీలు జీవనోపాధి పొందుతారు. అదేవిధంగా మార్కెట్ కమిటీకి సెస్సు లక్షల్లో వస్తుంది. 45 మామిడి మండీలున్నాయి. దక్షిణ భారత దేశంలోనే రైల్వేకోడూరు మామిడికి పేరుంది. కాగా ఈ ఏడాది కాపు తక్కువగా ఉన్నందున కేవలం రెండు నెలలు మాత్రమే వ్యాపారం సాగుతుందని ఇటు రైతులు, అటు వ్యాపారులు అంటున్నారు. ప్రకృతి వైపరీత్యాలు లేకుండా ఉంటే మామిడి రైతులకు అనుకూలంగా ఉంటుంది. ఏప్రిల్, మే మాసాల్లో ఎక్కువగా పెనుగాలులు ఉంటాయి. ప్రస్తుతం పచ్చడి, పండుకు జైపూర్ తదితర రాష్ట్రాలకు ఎగుమతులు రైతుల తోటల నుంచే సాగుతున్నాయి. పులిహోరా పండుకు టన్ను రూ.30 నుంచి రూ.40 వేలు, రుమాణి పచ్చడికి టన్ను రూ.20 వేలు, బేనీషా పండుకు రూ.50 నుంచి రూ.70 వేలు, తోతాపూరి టన్ను రూ.20 నుంచి రూ.30 వేలు, నాటు రకాలు (ఊరగాయకు) టన్ను రూ.15 నుంచి రూ.20 వేలు వరకు ధర ఉందని రైతులు, వ్యాపారులు అంటున్నారు. కాయలు ఉన్న రైతుకు ప్రస్తుతం కనక వర్షం కురుస్తుంది. గతేడాది వరకు బేనీషా కాపు బాగానే వచ్చింది. ఈ ఏడాది మాత్రం కాపు తక్కువగా రావడం కొసమెరుపు.

వర్షాలకు మామిడి దెబ్బతింది



ఈ ఏడాది జనవరిలో కురిసిన వర్షాలకు మామిడి దెబ్బతింది. ఉన్న పూతంతా మగ్గి రాలిపోయింది. తర్వాత వచ్చిన పూతలు సక్రమంగా నిలువలేదు. దీంతో ఈ సారి దిగుబడులు తక్కువగా వచ్చాయి. ఇప్పటికైతే వ్యాపారం బాగానే ఉంది. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా వివిధ రకాల మామిడి కాయలను పండిస్తున్నారు.

- పీరాన్, వ్యాపారి, రైల్వేకోడూరు



తోటలో కాసిన బేనీషా కాయలు

మామిడి ధరలు అనుకూలంగా ఉన్నాయి



మామిడి ధరలు అనుకూలంగా ఉన్నాయి. ప్రస్తుతం పండు, పచ్చడి కాయలను తోటల నుంచే రైతులు, వ్యాపారులు ఎగుమతి చేస్తున్నారు. మామిడికి విపరీతంగా తెగుళ్ల వచ్చాయి. వాటిని తట్టుకునేందుకు అనేక రకాల మందులను రైతులు పిచికారి చేయాల్సి వచ్చింది. కొందరు రైతులు మామిడి యార్డు నుంచి కాయలను తరలిస్తున్నారు.

- చంద్రశేఖర్‌రాజు, రైతు, సీఎం రాచపల్లె



ఇతర రాష్ట్రాలకు లోడింగ్ చేస్తున్న కూలీలు

దేశవాళీ రకాలను సేంద్రియ పద్ధతిలో సాగు చేయాలి

- జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్



దేశవాళీ సదస్సులో మాట్లాడుతున్న చంద్రానాయక్

కలికిరి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ పద్ధతిలో దేశవాళీ రకాల సాగు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ సూచించారు. ఇప్పటికే ఎన్నో రకాల దేశవాళీ రకాలు కనమరుగయ్యాయని, ఇప్పటికైనా ఉన్నవాటిని కాపాడుకోవలసిన అవసరముందని ఆయన తెలిపారు. స్థానిక కృషివిజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన దేశవాళీ రకాల విత్తనాలు, పూలు, పండ్లు ఇతర ఉత్పత్తుల ప్రదర్శన సందర్భంగా రాయలసీమ స్థాయి రైతు సదస్సులో ఆయన మాట్లాడుతూ దేశవాళీ విత్తనాలను తిరిగి ప్రాచుర్యంలోకి తెచ్చి, వాటికి భౌగోళిక గుర్తింపు తీసుకురావాలని కోరారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ దేశవాళీ పంటలు పురాతన కాలం నుంచి సహజ సిద్ధంగా రూపుదాల్చినవని, వీటిని కాపాడుకుని పునరుత్పత్తికి కృషి చేయాలని కోరారు. హైబ్రిడ్ జాతులకు అంటుకట్టే విధానంలో ఇప్పటికీ దేశవాళీ రకాల వేర్లను మూలాలుగా తీసుకుంటున్నారనే విషయం గుర్తించాలన్నారు. వాటి ప్రాముఖ్యతను పరిరక్షించాల్సిన అవసరముందన్నారు. దేశవాళీ రకాలను కాపాడటం వల్ల భావి తరాలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. ప్రతి దేశవాళీ రకానికి ఏదో ఒక ప్రత్యేకత ఉంటుందని, ఇప్పటికైనా జాగ్రత్తలు తీసుకుని ఆ సంతతిని కాపాడుకోవాలన్నారు. చింత, సీతాఫలం, మామిడి లాంటి పంటలకు భౌగోళిక గుర్తింపు తీసుకురావాలని కోరారు. దీనికి ప్రస్తుత సదస్సుతో పునాది పడిందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ, భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్), ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీలు ఈ ప్రదర్శనకు సహకారమందించాయి. ఈ ప్రదర్శనలో దేశవాళీ రకాలతో వరి, చిరుధాన్యాలు, నూనె గింజలు, అపరాలు, పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు, పసుపు, పూలు, చింత తదితర రకాలను ప్రదర్శనలో ఉంచారు. ఈ సదస్సులో కేవీకే కోఆర్డినేటర్ మంజుల, తిరుపతి వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీ సుమతి, శాస్త్రవేత్తలు డా.జాన్, రూపేశ్‌కుమార్‌రెడ్డి, శ్రీవల్లి, కలికిరి ఉద్యాన, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాళ్లు స్వరాజ్యలక్ష్మి, సుబ్రమణ్యం, జిల్లా సేంద్రియ వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ ప్రవీణ్‌రావు, ఆర్‌డీటీ మురళి, అభ్యుదయ రైతులు చందూల్ కుమార్‌రెడ్డి, స్వాతి, మధులత, మధుకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శివారెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు, పలువురు రైతులు, వ్యవసాయ విద్యార్థులు, కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు

అనంతపురంక్లాక్‌టవర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలో నిర్వహించిన ఏపీ రాష్ట్ర స్థాయి 10వ ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ మెమోరియల్ రగ్బీ సీనియర్ పురుషులు, మహిళల పోటీలు మంగళవారం ముగిశాయి. నీలం సంజీవరెడ్డి స్టేడియంలో ఫైనల్ పోటీలు నిర్వహించారు. పురుషుల విభాగంలో నెల్లూరు ప్రథమస్థానం, కర్నూలు ద్వితీయ స్థానం, గుంటూరు తృతీయ స్థానం, అనంతపురం నాలుగో స్థానంలో నిలిచాయి. మహిళల విభాగంలో తూర్పుగోదావరి విజేతగా నిలవగా, ఉమ్మడి అనంతపురం జిల్లా రన్నరప్‌గా నిలిచింది. డీఆర్‌ఓ మలోలా, పీటీసీ అడిషనల్ ఎస్పీ మల్లికార్జున వర్మ, ఆర్డీఓ కేశవ నాయుడుల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రగ్బీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు, జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు సుధా మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జానీశంకర్, కార్యదర్శి సంపత్‌కుమార్, కోశాధికారి శ్రీనివాసులు రెడ్డి, ఆర్గనైజింగ్ డైరెక్టర్ రాజశేఖర్, మెడికల్ డైరెక్టర్ కృష్ణ, సీనియర్ క్రీడాకారులు బయన్న, శంకర్, తిప్పేస్వామి, కవిత, నిర్మల, భార్గవి, తిరుపాల్, అజయ్ బాబు, సురేష్‌బాబు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి దారుణహత్య





హత్యగురైన సాదక్‌వలి (ఫైల్‌ఫొటో), సంఘటన స్థలంలో సాదిక్‌వలి మృతదేహం

కడప క్రైం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో నడిరోడ్డుపై ఓ యువకుడు అందరూ చూస్తుండగానే దారుణ హత్యకు గురయ్యాడు. నిందితుడు ఆటోలో వచ్చి ఆ యువకుడిని పిడిబాకుతో పొడిచి ఆపై కత్తితో గొంతుకోసి పరారయ్యాడు. కడప నగరం మరాఠీవీధికి చెందిన సాదిక్‌వలి(34) పండ్ల వ్యాపారంతో జీవనం సాగిస్తున్నాడు. ఇతడు మంగళవారం రాత్రి బిల్టప్ వద్ద నిల్చుని ఉండగా ఆటోలో వచ్చిన ఓ వ్యక్తి అందరూ చూస్తుండగానే హత్య చేసి పరారయ్యాడు. గతంలో సాదిక్ వలి ఓ వ్యక్తిని బిల్టప్ సర్కిల్ వద్దనే మద్యం సీసాతో హత్య చేశాడు. ఈ నేపథ్యంలో పాత కక్షలతోనే ఇతడిని హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, తాలూకా సీఐ వెంకటేశ్వర్లుతో పాటు స్పెషల్ బ్రాంచ్ సీఐలు భాస్కర్‌రెడ్డి, పురుషోత్తమ రాజు ఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. హత్యకు గల కారణాలు పోలీసుల వివరాల్లో తెలియాల్సి ఉంది. హత్యకు సంబంధించి అక్కడ ఉన్న సీసీ పుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు.



అందరూ చూస్తుండగా రోడ్డులో సాదిక్ వలి గొంతుకోస్తున్న నిందితుడు



రామాపురం చెరువులో మట్టి పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

‘ఉపాధి’ వెతలు

- ఉపాధి కూలీలకు అందని వేతనాలు
- కూలీలకు తాగునీరు, నీడ కరువే
- గుర్రంకొండలో నామమాత్రంగా పనులు

గుర్రంకొండ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు, కూలీలు వలసలు వెళ్లకుండా నివారించడానికి కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టింది. అయితే కూలీలకు ఉపాధిహామి సిబ్బంది పనులు కల్పించడంతో విఫలం అవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధి పనుల వద్ద కూలీలకు తాగునీరు, నీడ, ఫస్ట్ ఎయిడ్ కిట్స్, మజ్జిగ తదితర సౌకర్యాలను నామమాత్రంగా కల్పిస్తున్నారు. దీనికితోడు కూలీలకు మూడు నెలలుగా వేతనాలు రాలేదు. ఈ నేపథ్యంలో ఉపాధిహామీ పనులపై కూలీలు మక్కువ చూపడం లేదు. ఈ క్రమంలో ఉపాధి పనులకు రావడానికి కూలీలు సుముఖత చూపడం లేదు.

గుర్రంకొండ మండలంలో 15 పంచాయతీలలో 6 వేలు జాబ్‌కార్డులున్నాయి. ఇందులో ఉపాధిహామీ పథకంలో ఐదు వేల మంది కూలీలుండగా ప్రతి ఏటా రెండు నుంచి మూడు వేల మందిలోపు కూలీలు పనులు చేస్తున్నారు. ఉపాధి పనులు ప్రతి ఏటా జనవరి నుంచి జూన్ నెల వరకు బాగా జరుగుతాయి. ఈ ఆరు నెలల కాలంలో కూలీలకు పెద్దగా వ్యవసాయ, ఇతర కూలి పనులు దొరకవు. దీంతో ఉపాధి సిబ్బంది కూలీలకు పనులపై అవగాహన కల్పించి కూలీల సంఖ్యను పెంచాల్సి ఉంది. అంతేకాకుండా వేసవిలో కూలీలకు అదనంగా పనిదినాలు, వేతనాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచుతున్నాయి. దీంతో ఉపాధి సిబ్బంది క్షేత్ర స్థాయిలో రైతులకు అవసరమైన పనులను గుర్తించి చేయించాల్సి ఉంది. ప్రజలకు అవసరమైన పనులు చేపడితే కూలీల సంఖ్య పెరిగే అవకాశముంది. గుర్రంకొండ మండలంలో ఐదు వేల మంది ఉపాధి కూలీలుండగా కేవలం కొన్ని గ్రామాల్లో మాత్రమే ఉపాధి పనులు జరుగుతున్నాయి. దీంతో 15 పంచాయితీలకు గానూ కేవలం 500 మంది మాత్రమే పనులు చేస్తుండడం విశేషం. దీనిని బట్టి చూస్తే ఉపాధి సిబ్బంది పనితీరు గుర్రంకొండ మండలంలో ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది.

కూలీలకు అందని వేతనాలు..

ఉపాధిహామి పథకంలో భాగంగా వివిధ పనులు చేసిన కూలీలకు వేతనాలు అందలేదు. ఈ ఏడాది జనవరి 15వ తేది నుంచి ఏప్రిల్ 14వ తేది వరకు కూలీలు పనిచేసిన మూడు నెలలకు సంబంధించి వేతనాలు నిలిచిపోయాయి. కూలీలకు రావాల్సిన వేతనాలే రూ.71,92,800 పెండింగ్ ఉంది. అలాగే గ్రామాల్లో ఉపాధి పథకంలో సీసీ రోడ్లు, కాలువలు, గోకులాలు, నీటితొట్టెలకు సంబంధించిన నిధులు కూడా రూ.76,36,931 పెండింగ్‌లో ఉన్నాయి. ఈ క్రమంలో కూలీలు ఉపాధి పనులపై ఆసక్తి చూపడం లేదు. దీనికి తోడు వ్యవసాయ పనులకు వెళ్లితే సాయంత్రానికి లేదా మరుసటి రోజే కూలి డబ్బును ఇచ్చేస్తుండడంతో ఉపాధి పనులకు పోవడానికి చాలా మంది మొగ్గు చూపడం లేదు.

బకాయిలతో కూలీలు రావడం లేదు

ఉపాధిహామీ పథకంలో పనులు చేసిన కూలీలకు పది వారాలకు సంబంధించి బకాయి డబ్బులు రావాల్సి ఉంది. దీంతో పనులు చేయడానికి కూలీలు ఆసక్తి చూపడం లేదు. గ్రామాల్లో ఉపాధి పనులపై కూలీలకు అవగాహన కల్పించి కూలీల సంఖ్య పెంచడానికి ప్రతి రోజు ప్రయత్నిస్తున్నాం. ఈ వారంలో కూలీల సంఖ్య వెయ్యి దాటేలా లక్ష్యం నిర్దేశించుకుని పనులు చేయిస్తాం.

- జయరామిరెడ్డి, ఉపాధిహామీ పథకం ఏపీవో, గుర్రంకొండ మండలం

నామమాత్రంగా కూలీలకు వసతులు

ఉపాధిహామీ పథకంలో భాగంగా పనులు చేసే ప్రాంతంలో కూలీలకు తాగునీరు, మజ్జిగ, ఫస్టుఎయిడ్ కిట్, నీడ వంటి వసతులు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ మౌలిక వసతులను ఉపాధి సిబ్బంది కల్పించాలి. అయితే ఉపాధి కూలీలు పనిచేసే ప్రదేశంలో ఎక్కడా కానీ వసతులు లేవు. కూలీలే తమ వెంట వాటర్ బాటిళ్లలో తాగునీరు తెచ్చుకొంటున్నారు. ఎండకు ఎండుతూ ఉపాధి పనులు చేస్తున్నారు.

కడప విపత్తుల నిర్వహణ డీపీఎంగా ఉమారాణి

కలికిరి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా విపత్తుల నిర్వహణ సంస్థ డీపీఎంగా కె.ఉమారాణిని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకూ ఈమె స్పెషల్ డిప్యూటీ కలెక్టరుగా పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్నారు. కాగా రాజంపేట సోమశిల ప్రాజెక్టు యూనిట్-4 భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టరుగా పనిచేస్తున్న బి.లీలారాణి బదిలీ చేశారు. నెల్లూరు మెప్మా పీడీగా పోస్టింగ్ కోసం మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖకు కేటాయించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

రాజంపేట మున్సిపల్ కమిషనరుగా జి.శ్రీనివాసులు

కలికిరి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మున్సిపల్ కమిషనరుగా జి.శ్రీనివాసులును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టరుగా పనిచేస్తున్న శ్రీనివాసు లును ఖాళీగా వున్న రాజంపేట మున్సిపా లిటీకి కమిషనరుగా నియమిస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

కడప డిప్యూటీ కమిషనర్‌గా రాంబాబు

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా ఆర్.రాంబాబును నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ సెక్రటరీగా విధులు నిర్వహి స్తున్న రాంబాబును కడప కార్పొరేషన్ రెగ్యులర్ డిప్యూటీ కమిషనర్‌గా నియమించారు.

నాసిరకం విత్తనం.. దిగుబడి శూన్యం

- 100 ఎకరాలలో ఉల్లిపంటను దున్నేసిన రైతులు
- రూ.కోటి వరకు పెట్టుబడి నష్టం
- నాలుగు నెలల కష్టం మట్టిపాలు
- అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోని వైనం

ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతన్నలు నకిలీ విత్తనాలతో నట్టేట మునిగిపోతున్నారు. ఇటీవల పెండ్లిమర్రి మండలంలో ఉల్లి పంట సాగు చేసిన రైతు లు నకిలీ విత్తనాల కారణంగా దిగుబడి లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. రైతుల తమ గోడును, వ్యాపారి చేసిన మోసాన్ని సదరు అధికారులకు తెలియజేసినా పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో చివరకు రైతులు చేసేది లేక పంటను దున్నేశారు.

కడప రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పెండ్లిమర్రి మండలంలోని బాలయ్యగారిపల్లె, నల్లయ్యగారిపల్లె గ్రామాలకు చెందిన దాదాపు 60 మంది రైతులు మైదుకూరులోని ఓ వ్యాపారి దుకాణంలో ఉల్లి విత్తనాలు కొనుగోలు చేశారు. ఒక్కొక్క ప్యాకెట్‌కు రూ.450లు చెల్లించారు. ఇలా ఒక ఎకరా సాగుకు దాదాపు 15 విత్తన ప్యాకెట్ల చొప్పున మొత్తం రూ.6750లను ఖర్చుచేసి దాదాపు 100 ఎకరాలలో పంటను సాగుచేశారు. సేద్యాలకు, ఉల్లినాటుకు, కూలీలకు, కలుపు నివారణాకు, ఎరువులకు, పురుగుమందుల పిచికారికి, నీటి తడులకు ఇలా ఒక ఎకరాకు దాదాపు రూ.లక్ష చొప్పున 100 ఎకరాల సాగుకు రూ.ఒక కోటి వరకు పెట్టుబడి పెట్టారు. నాలుగు నెలల పాటు పంట ఎదుగుదలకు ఆరుగాలం శ్రమించారు. అన్ని దశలు పూర్తిచేసుకొని పంట నూర్పిళ్లకు రావడంతో నాసిరకం విత్తనాల డొల్లతనం బయటపడింది. ఉల్లికాడ కట్టినప్పటికీ భూమిలో ఉల్లిగడ్డ ఊరకుండా ఎదుగుబొదుగు లేకుండాపోయింది. దీంతో చేసేది లేక బాధిత రైతులు పంటను ట్రాక్టర్లు, సేద్యపు యంత్రాలు(టిల్లర్లు)తో చెడగొట్టారు. వ్యాపారి చేసిన మోసాన్ని ఉద్యానశాఖ అధికారులకు మొరపెట్టుకున్నారు. ఇటీవల జరిగిన జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో వ్యవసాయ స్థాయి సంఘం చైర్మన్ (జడ్పీ వైస్ చైర్మన్ పిట్టు బాలయ్య యాదవ్) స్వయాన రైతుల గోడును, వ్యాపారి చేసిన మోసాన్ని సదరు అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదు. దీంతో బాధిత రైతులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు.


పెండ్లిమర్రి మండలం నల్లయ్యగారిపల్లెలో ఎదుగుబొదుగు లేని ఉల్లిపంట (ఫైల్ ఫొటో)

10 ఎకరాల్లో పంట సాగు చేసి నష్టపోయా...



రబీ పంట కింద గత నవంబర్‌లో 10 ఎకరాల్లో ఉల్లిపంట సాగుచేశాను. ఓ మధ్యవర్తి ద్వారా మైదుకూరులోని ఓ సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణం నుంచి ఉల్లి విత్తనాలు కొనుగోలు చేశాను. పెట్టుబడి కింద దాదాపు లక్ష రూపాయల ఖర్చుచేశా. నాశిరకం విత్తనాల కారణంగా ఉల్లికాడ కట్టినప్పటికీ భూమిలో గడ్డ ఊరకుండా పోయింది. వ్యాపారిని ప్రశ్నిస్తే సరైన సమాధానం ఇవ్వకుండా దాటవేస్తున్నాడు. ఉద్యానశాఖ అధికారులకు తెలియజేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

-ధనుంజయరెడ్డి, నల్లయ్యగారిపల్లె

పట్టించుకునే వారేరి..

జిల్లాలో నాశిరకం విత్తనాల రైతులు నష్టపోతున్నా పట్టించుకునేవారే లేరు. జిల్లాలోని ఆయా వ్యవసాయ డివిజన్లలో వందల సంఖ్యలో విత్తన, ఎరువులు, పురుగుమందుల దుకాణాలున్నాయి. వీటిలో చాలా వరకు లైసెన్స్ లేని దుకాణాలు రైతులను నిలువునా ముంచేస్తున్నాయి. ఇందులో మైదుకూరు వ్యవసాయ డివిజన్‌లో ప్రధానంగా ఉన్నట్లు సమాచారం. వ్యవసాయ, విజిలెన్స్‌శాఖ అధికారుల నామమాత్రపు దాడుల ఫలితంగా ప్రైవేట్ వ్యాపారుల దోపిడీకీ అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాసిరకం విత్తనాల వ్యాపారానికి అడ్డుకట్ట వేసి కాపాడాలని రైతులు వేడుకుంటున్నారు.

తగు చర్యలు తీసుకుంటాం..

పెండ్లిమర్రి మండలంలోని బాలయ్యగారి పల్లె, నల్లయ్యగారిపల్లె గ్రామాలలో నాసిరకం విత్తనాల వలన ఉల్లిపంట దెబ్బతిని ఉంటే శాస్త్రవేత్తల ద్వారా పరిశోధనలు చేయించి నిర్ధారణ అయితే షాపు నిర్వహకుడిపై సీడ్ యాక్టు ప్రకారం చర్యలు తీసుకుంటాం. ఏపే గ్రామాలలో ఎన్ని ఎకరాలలో పంట దెబ్బతిందనే వివరాలను డీహెచ్‌వో ద్వారా తగు రిపోర్టు తెప్పించుకుని రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం.

-ఎ.నాగేశ్వరరావు, వ్యవసాయశాఖ జిల్లా అధికారి

పంటను తొలగించిన తర్వాత రైతులు తెలిపారు..

ఉల్లిపంట ఉద్యానశాఖకు సంబంధించినది అయినప్పటికీ.. విత్తనాలు మాత్రం సీడ్ యాక్టు కింద వ్యవసాయశాఖకు వర్తిస్తుంది. నాసిరకం విత్తనాలతో ఉల్లి పంటలో దిగుబడులు లేక నష్టపోయినట్లు పంటను తొలగించిన తురువాత బాధిత రైతులు హెచ్‌వోకు తెలియజేశారు. అయినా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వీరిని ఆదుకోవడానికి తగు చర్యలు తీసుకుంటాం.

- సుభాషిణి, ఉద్యానశాఖ ఏడీ

ప్రసిద్ధ రంగస్థల కళాకారులకు సన్మానం


రంగస్థల కళాకారులకు సన్మానం చేస్తున్న దృశ్యం

కడప కల్చరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని పురస్కరించుకుని ఏప్రిల్ 16న జరుపుకునే తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా జిల్లాకు చెందిన ప్రసిద్ధ రంగస్థల కళాకారులను సన్మానించినట్లు రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి తెలిపారు. కడప పట్టణంలోని స్థానిక పెన్షనర్స్ ఆఫీసులో మంగళవారం ఉదయం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ 2500 నాట కాల్లో విలక్షణమైన పాత్రలు పోషించి జిల్లాకే తలమానికంగా నిలిచి ఎన్నో అవార్డులు సాధించిన ఎస్.మధుబాబు, పది సంవత్సరాల వయసులో నాటక రంగంలో ప్రవేశించి నటిగా తన నటనా వైభవంతో నంది, గరుడ, కళారత్న తదితర సత్కారాలు అందుకున్న అరుణకుమారి, నాటకరంగమే శ్వాసగా జీవిస్తూ భిన్నమైన ఎన్నో పాత్రలను ధరించి జీవం పోస్తున్న దాసరి సుధాకర్, రంగస్థల కళా కారునిగా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, రంగస్థల కళాకారుడు పి.మల్లయ్యలను తమ సంస్థ ద్వారా సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సన్మాన గ్రహీతలు స్పందిస్తూ తెలుగునాటక రంగ దినోత్సవ సందర్భంగా జిల్లా రచయితల సంఘం ద్వారా సత్కారం పొందడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.రామ్మూర్తి నాయుడు, కోశాధికారి నూనె నగేశ్, సంయుక్త కార్యదర్శి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు మేకల సుబ్బరాయుడు పాల్గొన్నారు.

పులివెందులలో నాకాబందీ

- రికార్డులు సరిగా లేని 16 మోటార్‌బైకులు, ఆటో స్వాధీనం


సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ మురళీనాయక్

పులివెందుల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలోని నగరిగుట్టలో మంగళవారం తెల్లవారుజామున డీఎస్పీ ఆధ్వర్యంలో నాకా బందీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రికార్డులు సరిగా లేని 16 మోటార్ బైకులు, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే మంగళవారం రాత్రి పులివెందుల చుట్టు ఉన్న రింగు రోడ్డు తదితర ప్రాంతాల్లో సీఐ చాంద్‌బాష తమ సిబ్బందితో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న పలువురిపై కేసు నమోదు చేశారు. అంతకు ముందు డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐ లు, సిబ్బందితో అర్బన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో డీఎస్పీ మురళీనాయక్ సమావేశమయ్యారు. శాంతిభద్రతల వ్యవహారంలో కఠినంగా వ్యవహ రించాలని సూచించారు.

జమ్మలమడుగులో...

జమ్మలమడుగు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో మంగళవారం తెల్లవారుజాము నుంచి డీఎస్పీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని గూడెం చెరువు గ్రామం వద్ద వాహనాలు తనిఖీ చేసి రికార్డులు లేని 43 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అర్బన్ సీఐ లింగప్ప గ్రామీణ పరిధిలో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఎస్‌ఐలు రామకృష్ణ, హైమావతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలను నిర్మూలించడంలో భాగంగా కమలాపురంలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మంగళవారం కమలా పురం పట్టణంలో గల బీడీ కాలనీ, ఇందిరమ్మకాలనీ ఇతర అను మానిత ప్రదేశాల్లో కార్డెన్ సెర్చ్‌లో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు సీఐ రోషన్ తెలిపారు. సరైన పత్రాలు లేని 6 మోటరు సైకిళ్లు, 1 బొలెరో క్యాంపర్, 1 ప్యాసింజరు ఆటోను సీజ్ చేసి పోలీసుస్టేషన్ తరలించామన్నారు. కమలాపురం ఎస్ఐ విద్యాసాగర్, వల్లూరు ఎస్ఐ పెద్దఓబన్న పోలీసులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలంటూ ఆర్పీల నిరసన


మెప్మా పీడీ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆర్పీలు

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఏప్రిల్ 15 (ఆంధ్ర జ్యోతి): రెండు దశాబ్దాలకు పైగా సేవలు అందిస్తున్న తమను అనేక యాప్‌లు పెట్టి ఇబ్బందులు పెట్టకుండా ఉద్యోగ భద్రత కల్పించాలంటూ మెప్మా ఆర్పీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మెప్మా పీడీ కార్యాలయం ఎదుట ఆర్పీలు ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. అధ్యక్ష, కార్యదర్శులు కుమారి, రంగమ్మ మాట్లాడుతూ తమ ను నియమించే సమయంలో పదో తరగతి ఉత్తీర్ణత అయితే చాలని నియామకాలు చేశారన్నా రు. ఇన్ని ఏళ్లపాటు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా అందుతున్న సేవలను మహిళా సంఘాలకు అందజేస్తున్నామన్నారు. అయితే ఇటీవల కాలంలో అనేక యాప్‌లను తీసుకువచ్చి డిజిటల్ పద్ధ తుల ద్వారా సేవలందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంద న్నారు. దీంతో పాటు ఓటీపీ ద్వారా అనేక డాక్యుమెంట్లను తయారు చేయడం వల్ల కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. సభ్యులు ఓటీ పీలు కూడా చెప్పడం లేదన్నారు. ఓటీపీలు, టెక్నాలజీపై సభ్యులకు అనుమానాలు ఉండడం వల్ల సహకరించడం లేదని.. కొన్ని సందర్భాల్లో సంఘాల్లో నుంచి నిష్క్రమించేందుకు సిద్ధపడు తున్నారన్నారు. ఆర్పీల్లోని చాలా మందికి ఈ టెక్నాలజీపై అవ గాహన లేకపోవడంతో మాకు వచ్చే అరకొర జీతంలో టెక్నాలజీ తెలిసిన వారికి ఇచ్చి వారి ద్వారా పనులు చేయించుకుంటున్నట్లు వివరించారు. దీని వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన నెలకొనడంతో విధులను బహిష్కరించే పరిస్థితి ఉంద న్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు నెలకు రూ.18వేలు వేతనాన్ని పెంచుతూ తమ సొంత ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పీడీ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఈత కోసం వెళ్లి విద్యార్థిని మృతి


విద్యార్థిని తేజ మృతదేహం

అట్లూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలకూరు గ్రామానికి చెందిన చిట్టిబోయిన తేజ (15) ఈతకు వెళ్లి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం తోటి విద్యార్థులతో కలిసి గ్రామ సమీపంలో సగిలేరులో నీరు పారుతుండడంతో ఆనకట్ట వద్ద ఈతకు వెళ్లింది. తోటి విద్యార్థులతో ఈత ఆడుతుండగా నడుముకు కట్టుకున్న ప్లాస్టిక్ వస్తువు జారి పోవడంతో నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. గమనించిన తోటివిద్యార్థులు కేకలు వేయడంతో సగిలేరు పక్కనే ఉన్న అదే గ్రామానికి చెందిన సాంబయ్య అనే వ్యక్తి నీటిలో దూకి విద్యార్థిని కాపాడే ప్రయత్నం చేశాడు. అయితే అప్పటికే ప్రాణాలు కోల్పో యినట్లు బంధువులు తెలిపారు. కాగా, తేజ కమలకూరు ఉన్నత పాఠశాలలో 9వ తరగతి పూర్తి చేసుకుంది. తండ్రి సిద్దయ్య జీవ నోపాధి నిమిత్తం కువైట్‌కు వెళ్లారు. కుమార్తె మృతి విషయం తెలిసి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతురాలికి తల్లి సుభ ద్రమమ్మ, అక్క తులసి (18) తమ్ముడు నాని (11) సంవత్సరాలు ఉన్నారు.

అక్రమ సిలిండర్లు స్వాధీనం


సిలిండర్లను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

పులివెందుల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని రెండు రెస్టారెంట్‌లలో అక్రమంగా వినియోగిస్తున్న సిలిండర్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు కడప విజిలెన్స్ అధికారులు తెలిపారు. మంగళవారం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో పులివెందులలోని సుజాత సినిమా హాల్ సమీపంలోని అభిరుచి ఫ్యామిలీ రెస్టారెంట్, గరండల్ బ్రిడ్జి సమీపంలోని గిరి రెస్టారెం ట్‌లపై దాడులు చేశామన్నారు. వీరు గృహ అవసరాల నిమిత్తం వాడే గ్యాస్ సిలిండర్లను అక్రమంగా వినియోగిస్తున్నారు. వీరి నుంచి 15 గ్యాస్ సిలిండర్లను పంచనామా ద్వారా జప్తు చేసి పులివెందుల సీఎస్‌డీటీకి అప్పగించినట్లు తెలిపారు. రెస్టారెంట్‌లు నిర్వహించే సతీష్‌కుమార్, వెంకటరామిరెడ్డిలపై నిత్యావసర సరుకుల చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి


ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

పులివెందుల టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ కార్యాలయ గుంటూరు బృందం తెలిపారు. మంగళవారం పట్టణ పరిధిలోని పత్తి విత్తన దుకాణాలను పరిశీలించారు. విత్తన దుకాణాల లైసెన్సులను పరిశీలించి.. వివిధ రకాల కంపెనీల పత్తి విత్తనాల నాణ్యతను పరీక్షించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఆయిల్ సీడ్స్ బుక్కే భాస్కర్, అగ్రికల్చర్ ఆఫీసర్ శివశంకర్, జిల్లా వ్యవసాయ కార్యాలయ టెక్నికల్ గోవర్ధన్, మండల వ్యవసాయ అధికారి జి.నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం


కొండల నాగవర్ధన్‌రెడ్డి

కొండాపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దత్తాపురం గ్రామానికి చెందిన కొండల నాగవర్ధన్‌రెడ్డి అనే విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ విద్యార్థి తాడిపత్రిలోని సాయిసిద్ధార్థ కాలేజిలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 12వ తేదీ వచ్చిన ఇంటర్ ఫలితాల్లో ఫెయిలయ్యాడు. ఫలితాల కోసం కాలేజికి వెళ్లి, అప్పటి నుంచి కనబడటం లేదని తండ్రి పుల్లారెడ్డి తెలిపారు. ఇతని వయస్సు 16 సంవత్సరాలు ఉంటుందని, ఎవరైనా ఆచూకీ తెలిస్తే 9989500796 ఫోన్ నెంబరుకు తెలపాలని కోరారు.

వరిగడ్డి ట్రాక్టర్ దగ్ధం



వేంపల్లె, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం వైఎస్ మదీ నాపురం సమీపంలో వరిగడ్డి ట్రాక్టర్ దగ్ధమైంది. గేదెల కోసం శ్రీనివాసులరెడ్డి గడ్డిని ట్రాక్టర్‌లో తీసుకువెళుతుండగా మదీనాపురం వద్ద విద్యుత్ వైర్లు తగులుకొని మంటలు చెలరేగాయి. దీంతో గడ్డికి నిప్పంటుకుని పూర్తిగా దగ్ధం కాగా ట్రాక్టర్‌కు కొంతమేర నష్టం జరి గింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక కేంద్రం సిబ్బంది హుటాహుటిన ఘటనస్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. సమీపంలో ఉన్న రెండు గేదెలు గాయపడ్డాయి.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కడప రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మానసిక రోగుల కోసం ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం రిమ్స్ ఆవరణలోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ కేంద్రాన్ని విజిట్ చేసి న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మానసిక రోగులు మందులను సకాలంలో వాడి వ్యాధి తీవ్రతను తగ్గించుకోవాలన్నారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ మానసిక అనారోగ్యం ఉన్న వ్యక్తులు, మేథో వైకల్యాలున్న వ్యక్తులకు చట్టపరమైన సేవల పథకం 2024, మానసిక ఆరోగ్యం సంరక్షణ చట్టం 2017, జాతీయ మానసిక ఆరోగ్య విధానం 2014 తదితర వాటి గురించి తెలియజేశారు.

అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశం

న్యాయసేవాసదన్‌లో మంగళవారం అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు. జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్ నేతృత్వంలో కమిటీ అధికారులు సెక్షన్ 436ఏ సీఆర్‌పీసీ, 479 బీఎన్ఎస్ఎస్ అర్హత కలిగిన యూటీపీల గురించి, హైకోర్టు ద్వారా బెయిల్ మంజూరైన యూటీపీల గురించి చర్చించారు.

కార్యక్రమాలలో కడప అడిషనల్ ఎస్పీ, కడప డీఆర్‌వో, రాయచోటి రెవెన్యూ డివిజనల్ అధికారి, పురుషుల, మహిళల కేంద్ర కారాగారాల సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

'ఏఐఎస్ఎఫ్ పోరాటాలు స్ఫూర్తిదాయకం'

రాయచోటిటౌన్, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలపై అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) పోరాటాలు స్ఫూర్తిదాయకమని టీడీపీ బీసీ సాధికార సమితి పాల ఏకరి రాష్ట్ర కన్వీనర్ గురిగింజకుంట శివప్రసాద్‌నాయుడు పేర్కొన్నారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని భానుహరి రెసిడెన్సి వద్ద ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి హక్కులను పోరాటాల ద్వారానే సాధించుకోవాలన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పసుపులేటి కోటేశ్వరరావు, రాయచోటి నియోజకవర్గ నాయకులు నారాయణ, భార్గవ్, రెడ్డిశేఖర్, గురిగింజకుంట శివకుమార్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'మామిడి రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలి'

రాయచోటిటౌన్, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు, ఈదురు గాలులతో రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా మామిడి, ఇతర పంటలు దెబ్బతిన్న రైతులకు పరిహారం అందించాలని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులు, వడగండ్ల వర్షం దాటికి మామిడి పంట దెబ్బతిందని, ముఖ్యంగా రామాపురం మండలం రాచపల్లి గ్రామంలో సుమారు 600 ఎకరాల్లో పంట నేల రాలిందన్నారు. చేతికొచ్చే సమయంలో పంట నేలరాలడంతో పాటు చెట్లు కూడా దెబ్బతిన్నాయన్నారు. వాటికి కూడా నష్టపరిహారం చెల్లించి బాధితులను ఆదుకోవాలని

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) :మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతిల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే ఎల్లాయపల్లె, చెన్నరాజుపోడు, మంగళంపల్లె గ్రామ పంచాయతీల్లో రాజకీయ కారణాలతో ఉపాధి పనులు లేకుండా చేశారని ఆయా గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఎండలు ఎక్కువగా ఉండటంతో పని ప్రదేశాల్లో నీడ, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

'కొత్త వ్యక్తులు తారసపడితే సమాచారం ఇవ్వండి'



ప్రజలతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

సిద్దవటం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు తారసపడితే సమాచారం ఇవ్వాలని ఒంటిమిట్ట సీఐ బాబు, ఎస్ఐలు మహమ్మద్ రఫి, శివప్రసాద్ అన్నారు. మంగళవారం మాధవరం-1 గ్రామంలో నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వరుస చోరీల నియంత్రణ ఎస్పీ ఆదేశాలతో ఒంటిమిట్ట సీఐ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించి ప్రతి గృహాన్ని తనిఖీ చేసి ఆధార్, రేషన్, డోర్ నంబర్లు గుర్తించడానికి ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. అనుమానితులు ఎవరైనా గ్రామంలో ఉంటే సమాచారం తెలపాలని, ఇంటికి తాళాలు వేసి వెళ్లేటప్పుడు సమాచారం తెలపాలని సూచించారు.

మౌలిక సదుపాయాలతోనే గ్రామాల అభివృద్ధి




మాట్లాడుతున్న మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

గాలివీడు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మౌలిక సదుపాయాల కల్పనతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ప్యారంపల్లి, గోనపల్లి పంచాయతీల్లో పర్యటించారు. అనంతరం మాజీ మండల ఉపాధ్యక్షుడు గీదర ఈశ్వర్‌రెడ్డి స్వగృహంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సర్పంచ్ పార్థసారథిరెడ్డి, మాజీ సర్పంచులు మహమ్మద్ రియాజ్, పొట్టి జగన్నాథరెడ్డి,భద్రప్పనాయుడు, మాజీ ఎంపీటీసీ రెడ్డిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

అసలు రోడ్డుకే దిక్కులేదు..రింగు రోడ్డెందుకు

● అధికారుల తీరుపై కొత్తపల్లె అగ్రహారం గ్రామస్థుల ఆగ్రహం



నిలిచిపోయిన కొత్తపల్లె అగ్రహారం రోడ్డు



చొప్పావారిపల్లెకు కొత్తగా వేస్తున్న రోడ్డు

ఉన్న రోడ్డు సక్రమంగా లేదు.. చుట్టూ రోడ్డు ఎందుకు?



నిత్యం మాకు అవసరమైన రోడ్డు పనులు పూర్తి చేయాలని ఎన్నోసార్లు అధికారులను వేడుకున్నాం.ప్రయోజనం లేకపోయింది. ఇప్పుడేమో మా గ్రామం నుంచి ఇతర గ్రామాలు వెళ్లేందుకు కొత్తగా రోడ్డు వేస్తున్నారు. అవసరం లేని ఈ రింగ్‌రోడ్డు మాకెందుకు. క్రాంటాక్టర్ల కోసమేనా. ప్రజలకు అవసరం ఉన్న పనులు పట్టించుకోరా.

- శ్యామలబోయిన వెంకటరమణ, టీడీపీ నాయకుడు, కె.అగ్రహారం

ఆగిన రోడ్డు పనులు పూర్తి చేయండయ్యా



ఏడేళ్లుగా ఈ రోడ్డుపై నడిచి నరకం చూస్తున్నాం. ఎండాకాలంలో దుమ్ము, వానాకాలంలో బురదతో ఈ రోడ్డుపై నడవాలంటే అల్లాడుతున్నాం. మా పిల్లలు బడికి పోవాలన్నా, అవసరమైన పనులకు మండల కేంద్రానికి పోవాలన్నా చాలా కష్టంగా ఉంది. మా గ్రామానికి చుట్టూ రింగ్‌రోడ్డు ఎందుకయ్యా. ముందు మా సమస్య తీరాలంటే మండల కేంద్రానికి రోడ్డేయండి.

- చంద్ర, కొత్తపల్లె అగ్రహారం

పుల్లంపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : 'మింగ మెతుకు లేకున్నా మీసాలకు సంపెంగ నూనె' అన్నట్టుంది కొత్తపల్లె అగ్రహారం గ్రామ పరిస్థితి. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటినా మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొత్తపల్లె అగ్రహారానికి రోడ్డు సౌకర్యం లేదు. గత టీడీపీ ప్రభుత్వంలో కొత్తపల్లె అగ్రహారానికి ఎంఐపీ కింద రూ.1.30 కోట్లతో సెంట్రల్ బ్యాంకు నిధులు మం జూరు అయ్యాయి. వెంటనే ప్రభుత్వం మారడంతో వైసీపీ అధికారం చేపట్టిన వెంటనే రోడ్డు పనులు ప్రారంభించారు. గతంలో ఈ రోడ్డుపై నడవాలంటే మోకాటి లోతు గుంతలు. వర్షం వస్తే ఇల్లు దాటే పరిస్థితి లేదు. ఈ రోడ్డులో నడిచేటప్పుడు పాదరక్షలు చేతపట్టుకొని వెళ్లేవారు. ఇంత దౌర్భాగ్యంగా ఉండేది రోడ్డు పరిస్థితి. రోడ్డు పనుల్లో భాగంగా రోడ్డుకిరువైపులా మట్టి తీసి రోడ్డుపై వేశారు. కల్వర్టుల నిర్మాణానికి గుంతలు తీశారు. ఇక అంతే సంగతులు. ఏమైందో ఏమో... రోడ్డు పనులు ఆగిపోయాయి. దీంతో గ్రామస్థులే గుంతల్లో సిమెంటు రింగులు వేసి తాత్కాలింగా రోడ్డు ఏర్పాటు చేసుకున్నారు. మూడేళ్ల క్రితం రాజంపేట సబ్‌కలెక్టర్‌గా ఉన్న ఫర్మాన్ అహ్మద్ కార్యాలయానికి వెళ్లి గ్రామస్థులు రోడ్డు పరిస్థితిని మొరపెట్టుకున్నారు. వెంటనే ఆయన అధికారులతో కలిసి నిలిచిపోయిన రోడ్డును కొత్తపల్లి అగ్రహారం గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్థులంతా ఏకమై సమస్యను వినిపించారు. వర్షం వస్తే గ్రామమంతా నీటిమయమవుతుందని, రోడ్డుపై నడవలేని పరిస్థితి ఉందని, గ్రామంలో వర్షపునీళ్లు నిలబడకుండా చేయాలని, రోడ్డు పనులు పూర్తి చేయాలని విన్నవించారు. ఎందుకు ఆగిందో తెలుసుకొని వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. సబ్‌కలెక్టర్ ఆదేశాల మేరకు నెల తిరగకముందే రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి.

రోడ్డును లెవల్ చేసి చిప్స్ వేశారు. కంకర మిక్స్ చేసి చదును చేశారు. మళ్లీ పరిస్థితి మొదటికి వచ్చింది. ఎందుకు ఆగిందో తెలియదు. పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ఇప్పటికీ అలాగే ఉంది. మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరం ఉండడంతో పలు పనుల మీద గ్రామస్థులు, విద్యార్థులు ప్రతిరోజు వెళ్లాలంటే ఈ రోడ్డే దిక్కు. ప్రధాన రోడ్డు పనులు నిలిచిపోయి గ్రామస్థులు ఏడేళ్లకు పైగా అవస్థలు పడుతున్నారు.

అవసరం లేని రోడ్డు ఎవరి కోసం?

విచిత్రం ఏమిటంటే ఆగిన కొత్తపల్లె రోడ్డు పనులను అలాగే వదిలివేశారు. ఈ గ్రామానికి తూర్పు వైపున చొప్పవారిపల్లె గ్రామం ఉంది. దక్షిణం వైపున దలవాయిపల్లె గ్రామం ఉంది. ఈ రెండు గ్రామాలతో కొత్తపల్లి అగ్రహారం గ్రామ ప్రజలకు ఎటువంటి అవసరం లేదు. రాకపోకలు కూడా పెద్దగా ఉండవు. ప్రధానంగా గ్రామస్థులు ప్రతి విషయానికి పుల్లంపేటకు వెళ్లాల్సిందే. ఆగిపోయిన ప్రధాన రహదారి రోడ్డు పనులను వదిలేసి చొప్పావారిపల్లె, దలవాయిపల్లె గ్రామాలకు వెళ్లేందుకు కొత్తగా రోడ్డు పనులను ప్రారంభించారు. ఆగిన రోడ్డు పనులను పూర్తి చేయాలని అధికారులను వేడుకుంటే క్రాంటాక్టర్ల కోసం అవసరం లేని రోడ్డు పనులను చేపడుతున్నారని ఇదేందయ్యా మా గ్రామానికి రింగు రోడ్డు వేస్తున్నారా అని నవ్వుకుంటున్నారు. రిండు రోడ్డు వ్యవసాయ పనులకు వెళ్లేందుకు తప్ప మిగతా పనులకు అంతగా ఉపయోగపడదని, ప్రధాన రోడ్డు పనులను పూర్తి చేయాలంటున్నారు. ఉన్నతాధికారులు పరిశీలించి సమస్యను తీర్చాలని అధికారులకు విన్నవించుకుంటున్నారు.

వసంతోత్సవాలతో ముగిసిన శ్రీరామనవమి వేడుకలు



ఊరేగుతున్న సీత, రామ, లక్ష్మణులు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి వేడుకలు మంగళవారం వసంతోత్సవాలతో ముగిశాయి. వారం రోజుల పాటు గ్రామీణ, పట్టణప్రాంతాలు శ్రీరామనామ జపంతో పూజలు చేశారు. వడపప్పు, పానకాలు, గుగ్గిళ్లను ప్రసాదాలుగా పంపిణీ చేశారు. సీత, రామ, లక్ష్మణులను ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. వంతోత్సవాల్లో జరుపుకున్నారు. అనంతరం ప్రసాదం పంపిణీ చేశారు.

శ్మశానానికి స్థలం కేటాయించాలి

పెనగలూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండూరు గ్రామ పంచాయతీ పరిధిలో గల వెంగమాంబపురం గ్రామ ప్రజలకు శ్మశానానికి స్థలం కేటాయించాలని ఆ గ్రామ పెద్దలు, యూత్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం తహసీల్దారు అమరేశ్వరికి వినతిపత్రం అందించారు. గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు మలిశెట్టి నారాయణ, సుబ్బరాయుడు, మహేష్, నరసింహ, సుబ్బనరసయ్య పాల్గొన్నారు.

అగ్నిమాపక సిబ్బంది నీటి విన్యాసాలు

రాజంపేట టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రాజంపేట పట్టణంలోని పాతబస్టాండులో రెండోరోజు అగ్నిమాపక సిబ్బంది నీటితో వివిధ విన్యాసాలను నిర్వహించారు. మంగళవారం అగ్నిమాపక అధికారి కె.మాబుసుభాన్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించి అలాగే అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలను పంచిపెట్టారు. అనంతరం నీటితో వివిధ రకాల విన్యాసాలను నిర్వహించారు. ఈ విన్యా సాలను ప్రజలు ఆసక్తిగా వీక్షించారు.

రేపు జాబ్‌మేళా

రైల్వేకోడూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ఈనెల 17న రైల్వేకోడూరు మండలంలోని కే. బుడుగుంటపల్లె వద్ద ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పన కోసం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డి. నాగార్జున, కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు కల్గిన నిరుద్యోగ యువతీ, యువకులకు పదోవతరగతి, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసిన యువతీ, యువకులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ. 11,900 నుంచి రూ.18,500 వరకు జీతాలు అనుభవాన్ని బట్టి ఇస్తారన్నారు. ఇంటర్వ్యూకు తమ బయోడేటాతో పాటు ఆధార్‌కార్డు, విద్యార్హత పత్రాలు తీసుకుని రావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9550095775 అనే నెంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలని తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ప్రోగ్రాం నిర్వాహకుడు ముబారక్

సుండుపల్లె, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతాల నిర్వహణ, అక్షరాస్యతపైన అవగాహన కలిగి ఉండాలని ప్రోగ్రాం నిర్వాహకుడు ముబారక్ పేర్కొన్నారు. ఆర్బీఐ సహకారంతో మంగళవారం సుండుపల్లె ఎంపీడీవో కార్యాలయంలో అవగాహన సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఖాతాకు నామినీని నమోదు చేయాలని, సైబర్ నేరాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. పొదుపు సంఘాల వలన కలిగే లాభాలను వివరించారు. అనంతరం కళాజాత ద్వారా హాజరైన రైతులు స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాబార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం కోసం మహిళల ఆందోళన



ఆందోళన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

సిద్దవటం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యం అందలేదని గ్రామ సచివాలయం వద్ద మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని మాధవరం-1, ఎస్‌కేనగర్ గ్రామ మహిళలు మంగళవారం గ్రామ సచివాలయం-2 వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్‌షాపు 15 ద్వారా తమకు బియ్యం సక్రమంగా అందక కిరాణ షాపుల్లో బియ్యం కొనుగోలు చేసుకుంటున్నామన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



రాచపల్లిలో దెబ్బతిన్న మామిడి పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

రామాపురం, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): గాలి,వానతో నష్టపోయి రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాలి, వాన ప్రభావంతో దెబ్బతిన్న పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మామిడి చెట్లు నేలకొరిగాయని, దీంతో మామిడి కాయలు రాలిపోయి రైతులకు అపార నష్టం కలిగిందన్నారు. రైతుకు సబ్సిడీ, ఇన్సూరెన్స్ అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పంటల బీమా, అన్నదాత సుఖీభవ మంజూరు చేయాలన్నారు. ఆయన వెంట రైతు సంఘం నాయకులు షబ్బీర్‌బాషా, శివారెడ్డి, లక్ష్మిరెడ్డి, కిరణ్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, రాంమోహన, మదన, యువరాజు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో బీసీలకు అధిక ప్రాధాన్యం

● బీసీ సంఘం జిల్లా అధ్యక్షురాలు పద్మా యాదవ్



మాట్లాడుతున్న పద్మా యాదవ్

రాయచోటిటౌన్, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని జాతీయ బీసీ సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షురాలు పద్మాయాదవ్ అన్నారు. మంగళవారం ఆమె బీసీ సంఘం నేతలో కలిసి అన్నమయ్య జిల్లా బీసీ వెల్ఫేర్ కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీల అభివృద్ధికి ప్రభుత్వ చేపడుతున్న పథకాలను వివరించారు. బీసీ వెల్ఫేర్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాలు, ఇతర పథకాలకు సంబంధించి తెలుసుకునే వారు డిస్ట్రిక్ వర్కింగ్ ప్రెసిడెంట్ టీవీ రమణ, 9030465229కు సంప్రదించాలన్నారు.

అమానత్ సేవా సొసైటీ ఆధ్వర్యంలో రక్తదానం

రాయచోటిటౌన్, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు వైద్యం కోసం వచ్చిన లక్కిరెడ్డిపల్లె మండలానికి చెందిన గర్భిణికి ఓ పాజిటివ్ అత్యవసరం కావడంతో అమానత్ సేవా సొసైటీ అధ్యక్షుడు అతావుల్లా, రామాంజులు అనే వ్యక్తి ద్వారా రక్తదానం చేయించారు. అతావుల్లా మాట్లాడుతూ రక్తదానం మరొకరికి ప్రాణదానం అన్నారు. దేశంలో రక్తం కొరత వల్ల ఏడాదిలో 12 వేల మంది మృతి చెందుతున్నారని, దేశ జనాభాలోని 0.03 వా టా ప్రజలు రక్తదానం చేస్తే రక్త కొరతతో ఏ ప్రాణం పోదన్నారు.

డబ్బు విషయంపై ఉపాధ్యాయుల మధ్య ఘర్షణ

నందలూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఆడపూరు గ్రామంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయుల మధ్య డబ్బు విషయంపై మంగళవారం ఘర్షణ చోటు చేసుకుంది. సంగీతం టీచరు ఈశ్వరమ్మకు పార్ట్‌టైం తెలుగు టీచర్ శ్రీదేవి కొంత నగదును వేరేవారితో ఇప్పించింది. ఆ డబ్బు అడగడంతో ఇప్పుడు నా దగ్గర డబ్బు లేదు, ఐదు నెలల తర్వాత ఇస్తానని చెప్పడంతో ఇద్దరి మధ్య మాటా మాట పెరిగి ఘర్షణకు దిగారు. ప్రిన్సిపాల్‌కు ఈశ్వరమ్మ ఫిర్యాదు చేయడంతో శ్రీదేవి, ఈశ్వరమ్మ ప్రిన్సిపాల్ ఎదుటే ఘర్షణకు దిగారు. ఈ విషయం పోలీసుల వరకు వెళ్లినట్లు సమాచారం.

'గ్రామ సేవకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి'

రైల్వేకోడూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): గ్రామ సేవకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం రైల్వేకోడూరు రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ మహబూబ్‌చాంద్‌కు వినతి పత్రం సమర్పించారు.

రాజంపేటలో ఉరుములతో కూడిన వర్షం

రాజంపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : రాజంపేటలో మంగళవారం రాత్రి ఉరుములతో కూడిన వర్షం కురిసింది. రాత్రి 7.30 గంటల సమయంలో ఉరుములతో కూడిన వర్షం పడింది. ఓ మోస్తారు వర్షం కురవడంతో కొంత ఉపశమనం కలిగింది. పెద్దఎత్తున ఎండకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు కొద్దిపాటి వర్షం వల్ల ఉపశమనం కలిగించి.ంది. అయితే ఒకటి రెండు సార్లు భారీ ఉరుములు మెరుపులు రావడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. బలంగా ఈ దురుగాలులు వీయడంతో కొన్నిచోట్ల అరటి పంటకు నష్టం కలిగింది. పట్టణంలో వర్షం వల్ల కొద్దిపాటి రోడ్లు జలమయమయ్యాయి. దుమ్ము దూళితో రోడ్లు పాడిపోవడంతో వర్షం వల్ల శుభ్రమయ్యాయి. కరెంటుకు అంతరాయం కలిగింది.

దారి సమస్యను పరిష్కరించాలని జేసీకి వినతి



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న తంబళ్లపల్లి ప్రజలు

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండల పరిధిలోని ఎద్దులారిపల్లె దండువారిపల్లె దారి సమస్యను వెంటనే పరిష్కరించాలని మంగళవారం జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. తంబళ్లపల్లె వాసులతో కలిసి కలెక్టరేట్ ముందర సీపీ (ఎంఎల్) లిబరేషన్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తంబళ్లపల్లె మండలం ఎద్దులవారిపల్లె దండువారిపల్లెలో ఉన్న క్రిష్ణమ్మ ఆమె కుమారుడు రమేశ్‌రెడ్డిలు కలిసి దారిని ఆక్రమించారన్నారు. దీంతో రైతులు పొలాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు చొరవ తీసుకొని దారి ఇప్పించాలని వారు కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్, దండువారిపల్లె రైతులు శంకరయ్య, మల్లికార్జున, కుమార్, సిద్దయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

విధులకు గైర్హాజరైన వైద్యాధికారి

● అవస్థలు పడ్డ రోగులు ● డ్యూటీకి తరచూ డుమ్మాకొడుతున్న వైనం



వైద్యులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీ



డాక్టర్ లేకపోవడంతో రోగులకు వైద్య సలహాలు ఇస్తున్న స్టాఫ్‌నర్సు

సిద్దవటం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పి.కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న మహిళ వైద్యాధికారి డాక్టర్ రంగలక్ష్మి మంగళవారం విధులకు గైర్హాజరయ్యారు. ఉదయం 11 గంటలు కావస్తున్నా వైద్యాధికారిణి రాకపోవడంతో స్థానిక వైద్య సిబ్బంది రోగులకు మందు బిల్లలు అందించారు. పి.కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యాధికారులు ఉండగా డాక్టర్ శ్రీనివాసరెడ్డి 104 వైద్యసేవల్లో వెలుగుపల్లెలో విధులు నిర్వహిస్తున్నారు. మరో డాక్టర్ రంగలక్ష్మి విధుల్లో లేకపోవడంతో డాక్టర్ ఎక్కడ అని సిబ్బందిని విచారించగా ఆమె కడప డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మీటింగ్‌లో ఉన్నారని తెలిపారు. డాక్టర్ రంగలక్ష్మి విధులకు తరచూ డుమ్మా కొడుతున్నారని, జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేటు వైద్యశాలలో పనిచేస్తూ తమ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు తెలియజేశారు. డాక్టర్ రంగలక్ష్మి విధుల తీరుపై డీఎంహెచ్‌వో నాగరాజును వివరణ కోరగా మంగళవారం తమ కార్యాలయంలో ఎలాంటి సమావేశం నిర్వహించలేదన్నారు. డాక్టర్ రంగలక్ష్మి విధులకు గైర్హాజరైన విషయాన్ని విచారించి ఆమెపై తగు చర్యలు తీసుకుంటామని వివరించారు.

రైలుకింద పడి వ్యక్తి మృతి



సిద్దయ్య (ఫైల్)

నందలూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నందలూరు రైల్వే కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం సుమారు 2.10 గంటల సమయంలో కల్లగొట్ల సిద్దయ్య(45) అనేవ్యక్తి గూడ్సు రైలు కింద పడి మృతిచెందారు. ఈ సంఘటనపై జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ సుభాన్ మాట్లాడుతూ మహబూబ్ నగర్ వీధి, రంగసముద్రం, పోరుమామిళ్ల ప్రాంతానికి చెందిన సిద్దయ్య రైలు కింద పడి మృతిచెందారన్నారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కడప పట్టణంలోని రిమ్స్‌కు తరలించారు.

ఓబులవారిపల్లెలో: మండల పరిధిలోని ముక్కావారిపల్లె గ్రామ పంచాయతీలోని తురకపల్లెకు చెందిన షేక్ అహ్మద్‌అలీ(40) ప్రమాదవశాత్తు రైలుకింద పడి మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. వివరాల్లోకి వెళితే... తురకపల్లె గ్రామానికి చెందిన షేక్ అహ్మద్‌అలీ బేల్దారి పనులు చేసుకుంటూ జీవించేవాడు. ఇతనికి భార్య మౌలాని, ఏడుగురు సంతానం, వీరిలో ఇద్దరు ఆడబిడ్డలు, ఐదుగురు మగపిల్లలు. కుటుంబ పోషణ, ఆర్థిక సమస్యలతో సతమతమయ్యేవాడు. ఓబులవారిపల్లెలో బంధువుల ఇంటికి వెళ్లే క్రమంలో రైల్వేస్టేషన్ పరిధిలో ప్రమాదవశాత్తు రైలుకిందపడి మృతిచెందినట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నాటుసారా తయారు చేస్తున్న మహిళ అరెస్టు

మదనపల్లెటౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారు చేస్తున్న ఓ మహిళను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం సాయంత్రం మదనపల్లె ఎక్సైజ్ సీఐ భీమలింగ ఆధ్వర్యంలో దాదినాయనితాండా అటవీప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. నాటుసారా తయారు చేస్తున్న బుక్కే సురేష్ భార్య సవిత(19)ను అదుపులోకి తీసుకుని 52 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు పారిపోయిన సురేష్‌నాయక్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ జబీవుల్లా, పీసీలు నాగరాజు, మధు, రేఖ పాల్గొన్నారు.

కొడుకుపై తండ్రి కత్తితో దాడి

రైల్వేకోడూరురూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీవీ కండ్రిక పంచాయతీ పరిధిలోని పిట్లవారిపల్లిలో సోమవారం అర్ధరాత్రి మద్యం మత్తులో తండ్రి కొడుకుపై దాడి చేశాడు. పోలీసుల వివరాల మేరకు... పిట్టవారిపల్లికి చెందిన చింతల వెంకటయ్య అనే వ్యక్తి మద్యం మత్తులో తన భార్యతో గొడవ పడుతుండగా కొడుకు చింతల శివ తండ్రిపై ఘర్షణ పడ్డాడు. ఈ ఘర్షణలో వెంకటయ్య శివపై కత్తితో దాడి చేయడంతో శివ తీవ్రంగా గాయపడ్డాడు. బంధువులు వెంటనే శివను రైల్వే కోడూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో క్షతగాత్రుడిని తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు రైల్వేకోడూరు సీఐ హేమసుందర్ తెలిపారు.

కురబలకోట యువకుడు మృతి

కురబలకోట, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): తిరుమలలో జరిగిన గొడవలో కురబలకోట మండలానికి చెందిన యువకుడు మృతి చెందాడు. మండలంలోని నాయనవారిపల్లెకు చెందిన వెంకటశివ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. రెండు రోజుల క్రితం రాంభగీచా వద్ద వాహనాన్ని నిలుపగా తిరుపతికి చెందిన ముగ్గురు డ్రైవర్లు అతనితో గొడవపడ్డారు. వారు రాయితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన వెంకటశివను తిరుపతికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

సస్యరక్షణ పరికరాలు పంపిణీ



రైతులకు వేయింగ్ మిషన్ పంపిణీ చేస్తున్న ఏడీ నాగరాజు

సిద్దవటం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రైతులకు 50 శాతం సబ్సిడీపై సస్యరక్షణ పరికరాలు పంపిణీ చేసినట్లు బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు తెలిపారు. సిద్దవటం వ్యవసాయశాఖ కార్యాలయంలో వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రైతుసేవా కేంద్రాల వ్యవసాయశాఖ సహాయకులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర కేంద్రీయ ఉత్పత్తుల ధ్రువీకరణ అథారిటీ ప్రతినిధి వంశీ, శివఫణీంద్ర, రైతుసేవా కేంద్రాల వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రారంభమైన మామిడి కోతలు

- రైతులకు అనుకూలంగా ధరలు
- తోటల నుంచే ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు



రైల్వేకోడూరు మామిడి యార్డులో ట్రేల్లో ఉంచిన పులిహోర కాయలు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలో మామిడి కోతలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం రైతులకు మామిడి ధరలు అనుకూలంగా ఉండడంతో తోటల నుంచే ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి మాసంలో మామిడి పూతలు అనుకున్న స్థాయి కంటే ఎక్కువగా రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జనవరి ఆఖరిలో పూతలు ఉన్న సమయంలో వర్షం పడింది. వచ్చిన పూతంతా మగ్గి రాలిపోయింది. దీంతో ఈ ఏడాది 15 శాతం మాత్రమే పూత నిలవడంతో మామిడి పూతలు, పిందెలు, కాయలు నిలవడానికి ఈ ఏడాది రైతులు చాలా కష్టాలే పడ్డారు. కొందరు రసాయనిక ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా పిచికారి చేశారు. చాలా మంది రైతులు ఆర్గానిక్ పరంగా ఉన్న పశువుల ఎరువు, పులిసిన మజ్జిగ, వేప నూనె తదితర వాటిని పిచికారి చేశారు. దీంతో ఆశించిన దిగుబడి సాధించారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులను వాడిన వారి సక్రమంగా పూతలు, కాయలు నిలువకుండా పోయాయని పలువురు రైతులు చెబుతున్నారు. ఈ సారి మామిడికి బూడిద, తేనె మంచు, పండుఈగ తదితర రకాల తెగుళ్లు ఆశించాయి. దీనికి మందులు ఉపయోగించాల్సి వచ్చింది. ఒక రైతు రెండు సార్లు మాత్రమే గతంలో మందులను పిచికారి చేయాల్సి వచ్చేది. ఈ ఏడాదిలో నాలుగు సార్లు మందులను పిచికారి చేయాల్సి వచ్చింది. ఎకరాకు కూలీలు, దున్నకాలు, మందులు తదితర వాటికి రూ.20 నుంచి రూ.25 వేల వరకు ఖర్చు అయిందని రైతులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా మామిడికి వాతావరణ పరిస్థితులు కూడా పెద్దగా అనుకూలించలేదు. దీంతో చాలా మంది రైతుల తోటల్లో కాపు రాలేదు.

రైల్వేకోడూరు, పెనగలూరు, పుల్లంపేట, ఓబులవారిపల్లె, చిట్వేలి మండలాల్లో తోతాపూరి, పులిహోరా, కాలేపాడు, మల్లిక, ఖాదర్, బేనీషా, రసాలు, మాల్గోవా, నూనెపసందు, చెఱకురసం, నీలం, రుమాణి తదితర రకాలను రైతులు పండిస్తున్నారు. మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, జైపూర్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలకు కాయలను ఎగుమతి చేస్తున్నారు. రైల్వేకోడూరు మామిడి యార్డులో సుమారు రూ.100 కోట్లకు పైగా వ్యాపారం సాగుతుంది. 2 వేల మంది కూలీలు జీవనోపాధి పొందుతారు. అదేవిధంగా మార్కెట్ కమిటీకి సెస్సు లక్షల్లో వస్తుంది. 45 మామిడి మండీలున్నాయి. దక్షిణ భారత దేశంలోనే రైల్వేకోడూరు మామిడికి పేరుంది. కాగా ఈ ఏడాది కాపు తక్కువగా ఉన్నందున కేవలం రెండు నెలలు మాత్రమే వ్యాపారం సాగుతుందని ఇటు రైతులు, అటు వ్యాపారులు అంటున్నారు. ప్రకృతి వైపరిత్యాలు లేకుండా ఉంటే మామిడి రైతులకు అనుకూలంగా ఉంటుంది. ఏప్రిల్, మే మాసాల్లో ఎక్కువగా పెనుగాలులు ఉంటాయి. ప్రస్తుతం పచ్చడి, పండుకు జైపూర్ తదితర రాష్ట్రాలకు ఎగుమతులు రైతుల తోటల నుంచే సాగుతున్నాయి. పులిహోరా పండుకు టన్ను రూ.30 నుంచి రూ.40 వేలు, రుమాణి పచ్చడికి టన్ను రూ.20 వేలు, బేనీషా పండుకు రూ.50 నుంచి రూ.70 వేలు, తోతాపూరి టన్ను రూ.20 నుంచి రూ.30 వేలు, నాటు రకాలు (ఊరగాయకు) టన్ను రూ.15 నుంచి రూ.20 వేలు వరకు ధర ఉందని రైతులు, వ్యాపారులు అంటున్నారు. కాయలు ఉన్న రైతుకు ప్రస్తుతం కనక వర్షం కురుస్తుంది. గతేడాది వరకు బేనీషా కాపు బాగానే వచ్చింది. ఈ ఏడాది మాత్రం కాపు తక్కువగా రావడం కొసమెరుపు.

వర్షాలకు మామిడి దెబ్బతింది



ఈ ఏడాది జనవరిలో కురిసిన వర్షాలకు మామిడి దెబ్బతింది. ఉన్న పూతంతా మగ్గి రాలిపోయింది. తర్వాత వచ్చిన పూతలు సక్రమంగా నిలువ లేదు. దీంతో ఈ సారి దిగుబడులు తక్కువగా వచ్చాయి. ఇప్పటికైతే వ్యాపారం బాగానే ఉంది. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా వివిధ రకాల మామిడి కాయలను పండిస్తున్నారు.

– పీరాన్, వ్యాపారి, రైల్వేకోడూరు



తోటలో కాసిన బేనీషా కాయలు

మామిడి ధరలు అనుకూలంగా ఉన్నాయి



మామిడి ధరలు అనుకూలంగా ఉన్నాయి. ప్రస్తుతం పండు, పచ్చడి కాయలను తోటల నుంచే రైతులు, వ్యాపారులు ఎగుమతి చేస్తున్నారు. మామిడికి విపరీతంగా తెగుళ్ల వచ్చాయి. వాటిని తట్టుకునేందుకు అనేక రకాల మందులను రైతులు పిచికారి చేయాల్సి వచ్చింది. కొందరు రైతులు మామిడి యార్డు నుంచి కాయలను తరలిస్తున్నారు.

– చంద్రశేఖర్‌రాజు, రైతు, సీఎం రాచపల్లె



ఇతర రాష్ట్రాలకు లోడింగ్ చేస్తున్న కూలీలు

దేశవాళీ రకాలను సేంద్రియ పద్ధతిలో సాగు చేయాలి

- జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్



దేశవాళీ సదస్సులో మాట్లాడుతున్న చంద్రానాయక్

కలికిరి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ పద్ధతిలో దేశవాళీ రకాల సాగు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ సూచించారు. ఇప్పటికే ఎన్నో రకాల దేశవాళీ రకాలు కనమరుగయ్యాయని, ఇప్పటికైనా ఉన్నవాటిని కాపాడుకోవలసిన అవసరముందని ఆయన తెలిపారు. స్థానిక కృషివిజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన దేశవాళీ రకాల విత్తనాలు, పూలు, పండ్లు ఇతర ఉత్పత్తుల ప్రదర్శన సందర్భంగా రాయలసీమ స్థాయి రైతు సదస్సులో ఆయన మాట్లాడుతూ దేశవాళీ విత్తనాలను తిరిగి ప్రాచుర్యంలోకి తెచ్చి, వాటికి భౌగోళిక గుర్తింపు తీసుకురావాలని కోరారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ దేశవాళీ పంటలు పురాతన కాలం నుంచి సహజ సిద్ధంగా రూపుదాల్చినవని, వీటిని కాపాడు కుని పునరుత్పత్తికి కృషి చేయాలని కోరారు. హైబ్రిడ్ జాతులకు అంటుకట్టే విధానంలో ఇప్పటికీ దేశవాళీ రకాల వేర్లను మూలాలుగా తీసుకుంటున్నారనే విషయం గుర్తించాలన్నారు. వాటి ప్రాముఖ్యతను పరిరక్షించాల్సిన అవసరముందన్నారు. దేశవాళీ రకాలను కాపాడటం వల్ల భావి తరాలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. ప్రతి దేశవాళీ రకానికి ఏదో ఒక ప్రత్యేకత ఉంటుందని, ఇప్పటికైనా జాగ్రత్తలు తీసుకుని ఆ సంతతిని కాపాడుకోవాలన్నారు. చింత, సీతాఫలం, మామిడి లాంటి పంటలకు భౌగోళిక గుర్తింపు తీసుకురావాలని కోరారు. దీనికి ప్రస్తుత సదస్సుతో పునాది పడిందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ, భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్), ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీలు ఈ ప్రదర్శనకు సహకారమందించాయి. ఈ ప్రదర్శనలో దేశవాళీ రకాలతో వరి, చిరుధాన్యాలు, నూనె గింజలు, అపరాలు, పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు, పసుపు, పూలు, చింత తదితర రకాలను ప్రదర్శనలో ఉంచారు. ఈ సదస్సులో కేవీకే కోఆర్డినేటర్ మంజుల, తిరుపతి వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీ సుమతి, శాస్త్రవేత్తలు డా.జాన్, రూపేశ్‌కుమార్‌రెడ్డి, శ్రీవల్లి, కలికిరి ఉద్యాన, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాళ్లు స్వరాజ్యలక్ష్మి, సుబ్రమణ్యం, జిల్లా సేంద్రియ వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ ప్రవీణ్‌రావు, ఆర్‌డీటీ మురళి, అభ్యుదయ రైతులు చందూల్ కుమార్‌రెడ్డి, స్వాతి, మధులత, మధుకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శివారెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు, పలువురు రైతులు, వ్యవసాయ విద్యార్థులు, కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు

అనంతపురంక్లాక్‌టవర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలో నిర్వహించిన ఏపీ రాష్ట్ర స్థాయి 10వ ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ మెమోరియల్ రగ్బీ సీనియర్ పురుషులు, మహిళల పోటీలు మంగళవారం ముగిశాయి. నీలం సంజీవరెడ్డి స్టేడియంలో ఫైనల్ పోటీలు నిర్వహించారు. పురుషుల విభాగంలో నెల్లూరు ప్రథమస్థానం, కర్నూలు ద్వితీయ స్థానం, గుంటూరు తృతీయ స్థానం, అనంతపురం నాలుగో స్థానంలో నిలిచాయి. మహిళల విభాగంలో తూర్పుగోదావరి విజేతగా నిలవగా, ఉమ్మడి అనంతపురం జిల్లా రన్నరప్‌గా నిలిచింది. డీఆర్‌ఓ మలోలా, పీటీసీ అడిషనల్ ఎస్పీ మల్లికార్జున వర్మ, ఆర్డీఓ కేశవ నాయుడుల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రగ్బీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు, జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు సుధా మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జానీశంకర్, కార్యదర్శి సంపత్‌కుమార్, కోశాధికారి శ్రీనివాసులు రెడ్డి, ఆర్గనైజింగ్ డైరెక్టర్ రాజశేఖర్, మెడికల్ డైరెక్టర్ కృష్ణ, సీనియర్ క్రీడాకారులు బయన్న, శంకర్, తిప్పేస్వామి, కవిత, నిర్మల, భార్గవి, తిరుపాల్, అజయ్ బాబు, సురేష్‌బాబు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి దారుణహత్య





హత్యగురైన సాదక్‌వలి (ఫైల్‌ఫొటో), సంఘటన స్థలంలో సాదిక్‌వలి మృతదేహం

కడప క్రైం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో నడిరోడ్డుపై ఓ యువకుడు అందరూ చూస్తుండగానే దారుణ హత్యకు గురయ్యాడు. నిందితుడు ఆటోలో వచ్చి ఆ యువకుడిని పిడిబాకుతో పొడిచి ఆపై కత్తితో గొంతుకోసి పరారయ్యాడు. కడప నగరం మరాఠీవీధికి చెందిన సాదిక్‌వలి(34) పండ్ల వ్యాపారంతో జీవనం సాగిస్తున్నాడు. ఇతడు మంగళవారం రాత్రి బిల్టప్ వద్ద నిల్చుని ఉండగా ఆటోలో వచ్చిన ఓ వ్యక్తి అందరూ చూస్తుండగానే హత్య చేసి పరారయ్యాడు. గతంలో సాదిక్ వలి ఓ వ్యక్తిని బిల్టప్ సర్కిల్ వద్దనే మద్యం సీసాతో హత్య చేశాడు. ఈ నేపథ్యంలో పాత కక్షలతోనే ఇతడిని హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, తాలూకా సీఐ వెంకటేశ్వర్లుతో పాటు స్పెషల్ బ్రాంచ్ సీఐలు భాస్కర్‌రెడ్డి, పురుషోత్తమ రాజు ఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. హత్యకు గల కారణాలు పోలీసుల వివరాల్లో తెలియాల్సి ఉంది. హత్యకు సంబంధించి అక్కడ ఉన్న సీసీ పుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు.



అందరూ చూస్తుండగా రోడ్డులో సాదిక్ వలి గొంతుకోస్తున్న నిందితుడు



రామాపురం చెరువులో మట్టి పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

'ఉపాధి' వెతలు

- ఉపాధి కూలీలకు అందని వేతనాలు
- కూలీలకు తాగునీరు, నీడ కరువే
- గుర్రంకొండలో నామమాత్రంగా పనులు

గుర్రంకొండ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు, కూలీలు వలసలు వెళ్లకుండా నివారించడానికి కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టింది. అయితే కూలీలకు ఉపాధిహామి సిబ్బంది పనులు కల్పించడంతో విఫలం అవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధి పనుల వద్ద కూలీలకు తాగునీరు, నీడ, ఫస్ట్ ఎయిడ్ కిట్స్, మజ్జిగ తదితర సౌకర్యాలను నామమాత్రంగా కల్పిస్తున్నారు. దీనికితోడు కూలీలకు మూడు నెలలుగా వేతనాలు రాలేదు. ఈ నేపథ్యంలో ఉపాధిహామీ పనులపై కూలీలు మక్కువ చూపడం లేదు. ఈ క్రమంలో ఉపాధి పనులకు రావడానికి కూలీలు సుముఖత చూపడం లేదు.

గుర్రంకొండ మండలంలో 15 పంచాయతీలలో 6 వేలు జాబ్‌కార్డులున్నాయి. ఇందులో ఉపాధిహామీ పథకంలో ఐదు వేల మంది కూలీలుండగా ప్రతి ఏటా రెండు నుంచి మూడు వేల మందిలోపు కూలీలు పనులు చేస్తున్నారు. ఉపాధి పనులు ప్రతి ఏటా జనవరి నుంచి జూన్ నెల వరకు బాగా జరుగుతాయి. ఈ ఆరు నెలల కాలంలో కూలీలకు పెద్దగా వ్యవసాయ, ఇతర కూలి పనులు దొరకవు. దీంతో ఉపాధి సిబ్బంది కూలీలకు పనులపై అవగాహన కల్పించి కూలీల సంఖ్యను పెంచాల్సి ఉంది. అంతేకాకుండా వేసవిలో కూలీలకు అదనంగా పనిదినాలు, వేతనాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచుతున్నాయి. దీంతో ఉపాధి సిబ్బంది క్షేత్ర స్థాయిలో రైతులకు అవసరమైన పనులను గుర్తించి చేయించాల్సి ఉంది. ప్రజలకు అవసరమైన పనులు చేపడితే కూలీల సంఖ్య పెరిగే అవకాశముంది. గుర్రంకొండ మండలంలో ఐదు వేల మంది ఉపాధి కూలీలుండగా కేవలం కొన్ని గ్రామాల్లో మాత్రమే ఉపాధి పనులు జరుగుతున్నాయి. దీంతో 15 పంచాయితీలకు గానూ కేవలం 500 మంది మాత్రమే పనులు చేస్తుండడం విశేషం. దీనిని బట్టి చూస్తే ఉపాధి సిబ్బంది పనితీరు గుర్రంకొండ మండలంలో ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది.

కూలీలకు అందని వేతనాలు..

ఉపాధిహామి పథకంలో భాగంగా వివిధ పనులు చేసిన కూలీలకు వేతనాలు అందలేదు. ఈ ఏడాది జనవరి 15వ తేది నుంచి ఏప్రిల్ 14వ తేది వరకు కూలీలు పనిచేసిన మూడు నెలలకు సంబంధించి వేతనాలు నిలిచిపోయాయి. కూలీలకు రావాల్సిన వేతనాలే రూ.71,92,800 పెండింగ్ ఉంది. అలాగే గ్రామాల్లో ఉపాధి పథకంలో సీసీ రోడ్లు, కాలువలు, గోకులాలు, నీటితొట్లెలకు సంబంధించిన నిధులు కూడా రూ.76,36,931 పెండింగ్‌లో ఉన్నాయి. ఈ క్రమంలో కూలీలు ఉపాధి పనులపై ఆసక్తి చూపడం లేదు. దీనికి తోడు వ్యవసాయ పనులకు వెళ్లితే సాయంత్రానికి లేదా మరుసటి రోజే కూలి డబ్బును ఇచ్చేస్తుండడంతో ఉపాధి పనులకు పోవడానికి చాలా మంది మొగ్గు చూపడం లేదు.

బకాయిలతో కూలీలు రావడం లేదు

ఉపాధిహామీ పథకంలో పనులు చేసిన కూలీలకు పది వారాలకు సంబంధించి బకాయి డబ్బులు రావాల్సి ఉంది. దీంతో పనులు చేయడానికి కూలీలు ఆసక్తి చూపడం లేదు. గ్రామాల్లో ఉపాధి పనులపై కూలీలకు అవగాహన కల్పించి కూలీల సంఖ్య పెంచడానికి ప్రతి రోజు ప్రయత్నిస్తున్నాం. ఈ వారంలో కూలీల సంఖ్య వెయ్యి దాటేలా లక్ష్యం నిర్దేశించుకుని పనులు చేయిస్తాం.

– జయరామిరెడ్డి, ఉపాధిహామీ పథకం ఏపీవో, గుర్రంకొండ మండలం

నామమాత్రంగా కూలీలకు వసతులు

ఉపాధిహామీ పథకంలో భాగంగా పనులు చేసే ప్రాంతంలో కూలీలకు తాగునీరు, మజ్జిగ, ఫస్ట్‌ఎయిడ్ కిట్, నీడ వంటి వసతులు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ మౌలిక వసతులను ఉపాధి సిబ్బంది కల్పించాలి. అయితే ఉపాధి కూలీలు పనిచేసే ప్రదేశంలో ఎక్కడా కానీ వసతులు లేవు. కూలీలే తమ వెంట వాటర్ బాటిళ్లలో తాగునీరు తెచ్చుకొంటున్నారు. ఎండకు ఎండుతూ ఉపాధి పనులు చేస్తున్నారు.

కడప విపత్తుల నిర్వహణ డీపీఎంగా ఉమారాణి

కలికిరి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా విపత్తుల నిర్వహణ సంస్థ డీపీఎంగా కె.ఉమారాణిని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకూ ఈమె స్పెషల్ డిప్యూటీ కలెక్టరుగా పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్నారు. కాగా రాజంపేట సోమశిల ప్రాజెక్టు యూనిట్-4 భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టరుగా పనిచేస్తున్న బి.లీలారాణి బదిలీ చేశారు. నెల్లూరు మెప్మా పీడీగా పోస్టింగ్ కోసం మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖకు కేటాయించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

రాజంపేట మున్సిపల్ కమిషనరుగా జి.శ్రీనివాసులు

కలికిరి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మున్సిపల్ కమిషనరుగా జి.శ్రీనివాసులును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టరుగా పనిచేస్తున్న శ్రీనివాసు లును ఖాళీగా వున్న రాజంపేట మున్సిపా లిటీకి కమిషనరుగా నియమిస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

కడప డిప్యూటీ కమిషనర్‌గా రాంబాబు

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా ఆర్.రాంబాబును నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ సెక్రటరీగా విధులు నిర్వహి స్తున్న రాంబాబును కడప కార్పొరేషన్ రెగ్యులర్ డిప్యూటీ కమిషనర్‌గా నియమించారు.

నాసిరకం విత్తనం.. దిగుబడి శూన్యం

ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతన్నలు నకిలీ విత్త నాలతో నట్టేట మునిగిపోతున్నారు. ఇటీవల పెండ్లిమర్రి మండలంలో ఉల్లి పంట సాగు చేసిన రైతు లు నకిలీ విత్తనాల కారణంగా దిగుబడి లేకపో వడంతో తీవ్రంగా నష్టపోయారు. రైతుల తమ గోడును, వ్యాపారి చేసిన మోసాన్ని సదరు అధికారులకు తెలియజేసినా పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో చివరకు రైతులు చేసేది లేక పంటను దున్నేశారు.

- 100 ఎకరాలలో ఉల్లిపంటను దున్నేసిన రైతులు
- రూ.కోటి వరకు పెట్టుబడి నష్టం ● నాలుగు నెలల కష్టం మట్టిపాలు
- అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోని వైనం

కడప రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పెండ్లిమర్రి మండలంలోని బాలయ్యగారిపల్లె, నల్ల య్యగారిపల్లె గ్రామాలకు చెందిన దాదాపు 60 మంది రైతులు మైదుకూరులోని ఓ వ్యాపారి దుకాణంలో ఉల్లి విత్తనాలు కొనుగోలు చేశారు. ఒక్కొక్క ప్యాకెట్‌కు రూ.450లు చెల్లించారు. ఇలా ఒక ఎకరా సాగుకు దాదాపు 15 విత్తన ప్యాకెట్ల చొప్పున మొత్తం రూ.6750లను ఖర్చుచేసి దాదాపు 100 ఎకరాలలో పంటను సాగుచేశారు. సేద్యాలకు, ఉల్లినాటుకు, కూలీలకు, కలుపు నివారణాకు, ఎరువులకు, పురుగుమందుల పిచికారికి, నీటి తడులకు ఇలా ఒక ఎకరాకు దాదాపు రూ.లక్ష చొప్పున 100 ఎకరాల సాగుకు రూ.ఒక కోటి వరకు పెట్టుబడి పెట్టారు. నాలుగు నెలల పాటు పంట ఎదుగుదలకు ఆరుగాలం శ్రమించారు. అన్ని దశలు పూర్తిచేసుకొని పంట నూర్పిళ్లకు రావడంతో నాసిరకం విత్తనాల డొల్లతనం బయటపడింది. ఉల్లికాడ కట్టినప్పటికీ భూమిలో ఉల్లిగడ్డ ఊరకుండా ఎదుగుబొదుగు లేకుండాపోయింది. దీంతో చేసేది లేక బాధిత రైతులు పంటను ట్రాక్టర్లు, సేద్యపు యంత్రాలు(టిల్లర్లు)తో చెడగొట్టారు. వ్యాపారి చేసిన మోసాన్ని ఉద్యానశాఖ అధికారులకు మొరపెట్టుకున్నారు. ఇటీవల జరిగిన జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో వ్యవసాయ స్థాయి సంఘం చైర్మన్ (జడ్పీ వైస్ చైర్మన్ పిట్టు బాలయ్య యాదవ్) స్వయాన రైతుల గోడును, వ్యాపారి చేసిన మోసాన్ని సదరు అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదు. దీంతో బాధిత రైతులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు.


పెండ్లిమర్రి మండలం నల్లయ్యగారిపల్లెలో ఎదుగుబొదుగు లేని ఉల్లిపంట (ఫైల్ ఫొటో)

10 ఎకరాల్లో పంట సాగు చేసి నష్టపోయా...



రబీ పంట కింద గత నవంబర్‌లో 10 ఎకరాల్లో ఉల్లిపంట సాగుచేశాను. ఓ మధ్యవర్తి ద్వారా మైదుకూరులోని ఓ సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణం నుంచి ఉల్లి విత్తనాలు కొనుగోలు చేశాను. పెట్టుబడి కింద దాదాపు లక్ష రూపాయల ఖర్చుచేశా. నాశిరకం విత్తనాల కారణంగా ఉల్లికాడ కట్టినప్పటికీ భూమిలో గడ్డ ఊరకుండా పోయింది. వ్యాపారిని ప్రశ్నిస్తే సరైన సమాధానం ఇవ్వకుండా దాటవేస్తున్నాడు. ఉద్యానశాఖ అధికారులకు తెలియజేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

-ధనుంజయరెడ్డి, నల్లయ్యగారిపల్లె

పట్టించుకునే వారేరి..

జిల్లాలో నాశిరకం విత్తనాల రైతులు నష్టపోతున్నా పట్టించుకునేవారే లేరు. జిల్లాలోని ఆయా వ్యవసాయ డివిజన్లలో వందల సంఖ్యలో విత్తన, ఎరువులు, పురుగుమందుల దుకాణాలున్నాయి. వీటిలో చాలా వరకు లైసెన్స్ లేని దుకాణాలు రైతులను నిలువునా ముంచేస్తున్నాయి. ఇందులో మైదుకూరు వ్యవసాయ డివిజన్‌లో ప్రధానంగా ఉన్నట్లు సమాచారం. వ్యవసాయ, విజిలెన్స్‌శాఖ అధికారుల నామమాత్రపు దాడుల ఫలితంగా ప్రైవేట్ వ్యాపారుల దోపిడీకీ అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాసిరకం విత్తనాల వ్యాపారానికి అడ్డుకట్ట వేసి కాపాడాలని రైతులు వేడుకుంటున్నారు.

తగు చర్యలు తీసుకుంటాం..

పెండ్లిమర్రి మండలంలోని బాలయ్యగారి పల్లె, నల్లయ్యగారిపల్లె గ్రామాలలో నాసిరకం విత్తనాల వలన ఉల్లిపంట దెబ్బతిని ఉంటే శాస్త్రవేత్తల ద్వారా పరిశోధనలు చేయించి నిర్ధారణ అయితే షాపు నిర్వాహకుడిపై సీడ్ యాక్టు ప్రకారం చర్యలు తీసుకుంటాం. ఏఏ గ్రామాలలో ఎన్ని ఎకరాలలో పంట దెబ్బతిందనే వివరాలను డీహెచ్‌వో ద్వారా తగు రిపోర్టు తెప్పించుకుని రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం.

-ఎ.నాగేశ్వరరావు, వ్యవసాయశాఖ జిల్లా అధికారి

పంటను తొలగించిన తర్వాత రైతులు తెలిపారు..

ఉల్లిపంట ఉద్యానశాఖకు సంబంధించినది అయినప్పటికీ.. విత్తనాలు మాత్రం సీడ్ యాక్టు కింద వ్యవసాయశాఖకు వర్తిస్తుంది. నాసిరకం విత్తనాలతో ఉల్లి పంటలో దిగుబడులు లేక నష్టపోయినట్లు పంటను తొలగించిన తురువాత బాధిత రైతులు హెచ్‌వోకు తెలియజేశారు. అయినా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వీరిని ఆదుకోవడానికి తగు చర్యలు తీసుకుంటాం.

- సుభాషిణి, ఉద్యానశాఖ ఏడీ

ప్రసిద్ధ రంగస్థల కళాకారులకు సన్మానం


రంగస్థల కళాకారులకు సన్మానం చేస్తున్న దృశ్యం

కడప కల్చరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని పురస్కరించుకుని ఏప్రిల్ 16న జరుపుకునే తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా జిల్లాకు చెందిన ప్రసిద్ధ రంగస్థల కళాకారులను సన్మానించినట్లు రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి తెలిపారు. కడప పట్టణంలోని స్థానిక పెన్షనర్స్ ఆఫీసులో మంగళవారం ఉదయం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ 2500 నాట కాల్లో విలక్షణమైన పాత్రలు పోషించి జిల్లాకే తలమానికంగా నిలిచి ఎన్నో అవా ర్డులు సాధించిన ఎస్.మధుబాబు, పది సంవత్సరాల వయసులో నాటక రంగంలో ప్రవేశించి నటిగా తన నటనా వైభవంతో నంది, గరుడ, కళారత్న తదితర సత్కారాలు అందుకున్న అరుణకుమారి, నాటకరంగమే శ్వాసగా జీవిస్తూ భిన్నమైన ఎన్నో పాత్రలను ధరించి జీవం పోస్తున్న దాసరి సుధాకర్, రంగస్థల కళా కారునిగా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, రంగస్థల కళాకారుడు పి.మల్లయ్యలను తమ సంస్థ ద్వారా సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సన్మాన గ్రహీతలు స్పందిస్తూ తెలుగునాటక రంగ దినోత్సవ సందర్భంగా జిల్లా రచయితల సంఘం ద్వారా సత్కారం పొందడం సంతో షాన్ని ఇచ్చిందన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.రామ్మూర్తి నాయుడు, కోశాధికారి నూనె నగేశ్, సంయుక్త కార్యదర్శి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు మేకల సుబ్బరాయుడు పాల్గొన్నారు.

రోస్టర్ విధానంలో సమన్యాయం చేయాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య

పులివెందుల రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రోస్టర్ విధానంలో మాదిగ లకు సమన్యాయం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి రామయ్యగారి కృష్ణమూర్తితో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ షెడ్యూల్డ్ కులాల వర్గీకరణకు సంబం ధించి రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ మార్చి 11వ తేదీన ప్రభుత్వానికి నివేదిక సమర్పిం చిందన్నారు. ఈ అంశంపై శాసన సభలో ఏకగ్రీవ తీర్మానం చేశారన్నారు. అయితే జనాభా నిష్పత్తి ప్రకారం రావాల్సినంత రిజర్వేషన్లు దక్కకపోవడం బాధాకరమన్నారు. ఈ విషయంపై ఈనెల 21వ తేదీన సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ముందు ధర్నా నిర్వహించను న్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డప్పు చర్మకారుల రాష్ట్ర అధ్యక్షులు నాగ భూషణం, ఎమ్మా ర్పీఎస్ జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, ప్రొద్దుటూరు మండల అధ్యక్షుడు బాల నరసింహులు, బలపనూరు భార్గవ, భీమన్న, గంగులయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్ రాజ్యాంగ విరుద్ధం

- ప్రజా సంఘాల ఐక్యవేదిక

కడప మారుతీనగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీల మీద నరమేధాన్ని కొనసాగిస్తోందని ప్రజాసంఘాల నాయకులు ధ్వజమెత్తారు. మంగళవారం కడప ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, సీపీఐఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనరు గోపాల్, ప్రజాహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాయలసీమ కార్మిక సమాఖ్య నాయకులు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను హత్య చేస్తోందని ఆరోపించారు. కాగా20న కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం పక్కన ఉన్న ఇంజనీరింగ్ హాల్లో జరిగే సదస్సుకు పెద్దఎత్తున ప్రగతిశీలవాదులందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.

పులివెందులలో నాకాబందీ

- రికార్డులు సరిగా లేని 16 మోటార్‌బైకులు, ఆటో స్వాధీనం


సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ మురళీనాయక్

పులివెందుల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలోని నగరిగుట్టలో మంగళవారం తెల్లవారుజామున డీఎస్పీ ఆధ్వర్యంలో నాకా బందీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రికార్డులు సరిగా లేని 16 మోటార్ బైకులు, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే మంగళవారం రాత్రి పులివెందుల చుట్టు ఉన్న రింగు రోడ్డు తదితర ప్రాంతాల్లో సీఐ చాంద్‌బాష తమ సిబ్బందితో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న పలువురిపై కేసు నమోదు చేశారు. అంతకు ముందు డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐ లు, సిబ్బందితో అర్బన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో డీఎస్పీ మురళీనాయక్ సమావేశమయ్యారు. శాంతిభద్రతల వ్యవహారంలో కఠినంగా వ్యవహ రించాలని సూచించారు.

జమ్మలమడుగులో...

జమ్మలమడుగు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో మంగళవారం తెల్లవారుజాము నుంచి డీఎస్పీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని గూడెం చెరువు గ్రామం వద్ద వాహనాలు తనిఖీ చేసి రికార్డులు లేని 43 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అర్బన్ సీఐ లింగప్ప గ్రామీణ పరిధిలో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఎస్‌ఐలు రామకృష్ణ, హైమావతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలను నిర్మూలించడంలో భాగంగా కమలాపురంలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మంగళవారం కమలా పురం పట్టణంలో గల బీడీ కాలనీ, ఇందిరమ్మకాలనీ ఇతర అను మానిత ప్రదేశాల్లో కార్డెన్ సెర్చ్‌లో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు సీఐ రోషన్ తెలిపారు. సరైన పత్రాలు లేని 6 మోటరు సైకిళ్లు, 1 బొలెరో క్యాంపర్, 1 ప్యాసింజరు ఆటోను సీజ్ చేసి పోలీసుస్టేషన్ తరలించామన్నారు. కమలాపురం ఎస్‌ఐ విద్యాసాగర్, వల్లూరు ఎస్‌ఐ పెద్దఓబన్న పోలీసులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలంటూ ఆర్పీల నిరసన


మెప్మా పీడీ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆర్పీలు

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఏప్రిల్ 15 (ఆంధ్ర జ్యోతి): రెండు దశాబ్దాలకు పైగా సేవలు అందిస్తున్న తమను అనేక యాప్‌లు పెట్టి ఇబ్బందులు పెట్టకుండా ఉద్యోగ భద్రత కల్పించాలంటూ మెప్మా ఆర్పీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మెప్మా పీడీ కార్యాలయం ఎదుట ఆర్పీలు ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. అధ్యక్ష, కార్యదర్శులు కుమారి, రంగమ్మ మాట్లాడుతూ తమ ను నియమించే సమయంలో పదో తరగతి ఉత్తీర్ణత అయితే చాలని నియామకాలు చేశారన్నా రు. ఇన్ని ఏళ్లపాటు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా అందుతున్న సేవలను మహిళా సంఘాలకు అందజేస్తున్నామన్నారు. అయితే ఇటీవల కాలంలో అనేక యాప్‌లను తీసుకువచ్చి డిజిటల్ పద్ధ తుల ద్వారా సేవలందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంద న్నారు. దీంతో పాటు ఓటీపీ ద్వారా అనేక డాక్యుమెంట్లను తయారు చేయడం వల్ల కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. సభ్యులు ఓటీ పీలు కూడా చెప్పడం లేదన్నారు. ఓటీపీలు, టెక్నాలజీపై సభ్యులకు అనుమానాలు ఉండడం వల్ల సహకరించడం లేదని.. కొన్ని సందర్భాల్లో సంఘాల్లో నుంచి నిష్క్రమించేందుకు సిద్ధపడు తున్నారన్నారు. ఆర్పీల్లోని చాలా మందికి ఈ టెక్నాలజీపై అవ గాహన లేకపోవడంతో మాకు వచ్చే అరకొర జీతంలో టెక్నాలజీ తెలిసిన వారికి ఇచ్చి వారి ద్వారా పనులు చేయించుకుంటున్నట్లు వివరించారు. దీని వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన నెలకొనడంతో విధులను బహిష్కరించే పరిస్థితి ఉంద న్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు నెలకు రూ.18వేలు వేతనాన్ని పెంచుతూ తమ సొంత ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పీడీ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఈత కోసం వెళ్లి విద్యార్థిని మృతి


విద్యార్థిని తేజ మృతదేహం

అట్లూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలకూరు గ్రామానికి చెందిన చిట్టిబోయిన తేజ (15) ఈతకు వెళ్లి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం తోటి విద్యార్థులతో కలిసి గ్రామ సమీపంలో సగిలేరులో నీరు పారుతుండడంతో ఆనకట్ట వద్ద ఈతకు వెళ్లింది. తోటి విద్యార్థులతో ఈత ఆడుతుండగా నడుముకు కట్టుకున్న ప్లాస్టిక్ వస్తువు జారి పోవడంతో నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. గమనించిన తోటివిద్యార్థులు కేకలు వేయడంతో సగిలేరు పక్కనే ఉన్న అదే గ్రామానికి చెందిన సాంబయ్య అనే వ్యక్తి నీటిలో దూకి విద్యార్థిని కాపాడే ప్రయత్నం చేశాడు. అయితే అప్పటికే ప్రాణాలు కోల్పో యినట్లు బంధువులు తెలిపారు. కాగా, తేజ కమలకూరు ఉన్నత పాఠశాలలో 9వ తరగతి పూర్తి చేసుకుంది. తండ్రి సిద్దయ్య జీవ నోపాధి నిమిత్తం కువైట్‌కు వెళ్లారు. కుమార్తె మృతి విషయం తెలిసి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతురాలికి తల్లి సుభ ద్రమమ్మ, అక్క తులసి (18) తమ్ముడు నాని (11) సంవత్సరాలు ఉన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం


కొండల నాగవర్ధన్‌రెడ్డి

కొండాపురం, ఏప్రిల్ 15 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని దత్తాపురం గ్రామానికి చెందిన కొండల నాగ వర్ధన్‌రెడ్డి అనే విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ విద్యార్థి తాడిపత్రిలోని సాయిసిద్దార్థ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 12వ తేదీ వచ్చిన ఇంటర్ ఫలితాల్లో ఫెయిల య్యాడు. ఫలితాల కోసం కాలేజికి వెళ్లి, అప్పటి నుంచి కనబడటం లేదని తండ్రి పుల్లారెడ్డి తెలిపారు. ఇతని వయస్సు 16 సంవత్సరాలు ఉంటుందని, ఎవరైనా ఆచూకీ తెలిస్తే 9989500796 ఫోన్ నెంబరుకు తెలపాలని కోరారు.

అక్రమ సిలిండర్లు స్వాధీనం


సిలిండర్లను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

పులివెందుల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని రెండు రెస్టారెంట్‌లలో అక్రమంగా వినియోగిస్తున్న సిలిండర్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు కడప విజిలెన్స్ అధికారులు తెలిపారు. మంగళవారం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో పులివెందులలోని సుజాత సినిమా హాల్ సమీపంలోని అభిరుచి ఫ్యామిలీ రెస్టారెంట్, గరండల్ బ్రిడ్జి సమీపంలోని గిరి రెస్టారెం ట్‌లపై దాడులు చేశామన్నారు. వీరు గృహ అవసరాల నిమిత్తం వాడే గ్యాస్ సిలిండర్లను అక్రమంగా వినియోగిస్తున్నారు. వీరి నుంచి 15 గ్యాస్ సిలిండర్లను పంచనామా ద్వారా జప్తు చేసి పులివెందుల సీఎస్‌డీటీకి అప్పగించినట్లు తెలిపారు. రెస్టారెంట్‌లు నిర్వహించే సతీష్‌కుమార్, వెంకటరామిరెడ్డిలపై నిత్యావసర సరుకుల చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వరిగడ్డి ట్రాక్టర్ దగ్ధం



వేంపల్లె, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం వైఎస్ మదీ నాపురం సమీపంలో వరిగడ్డి ట్రాక్టర్ దగ్ధమైంది. గేదెల కోసం శ్రీనివాసులరెడ్డి గడ్డిని ట్రాక్టర్‌లో తీసుకువెళుతుండగా మదీనాపురం వద్ద విద్యుత్ వైర్లు తగులుకొని మంటలు చెలరేగాయి. దీంతో గడ్డికి నిప్పంటుకుని పూర్తిగా దగ్ధం కాగా ట్రాక్టర్‌కు కొంతమేర నష్టం జరి గింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక కేంద్రం సిబ్బంది హుటాహుటిన ఘటనస్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. సమీపంలో ఉన్న రెండు గేదెలు గాయపడ్డాయి.

నాణ్యమైన విత్తనాలు అందించాలి


ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

పులివెందుల టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ కార్యాలయ గుంటూరు బృందం తెలిపారు. మంగళవారం పట్టణ పరిధిలోని పత్తి విత్తన దుకాణాలను పరిశీలించారు. విత్తన దుకాణాల లైసెన్సులను పరిశీలించి.. వివిధ రకాల కంపెనీల పత్తి విత్తనాల నాణ్యతను పరీక్షించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఆయిల్ సీడ్స్ బుక్కే భాస్కర్, అగ్రికల్చర్ ఆఫీసర్ శివశంకర్, జిల్లా వ్యవసాయ కార్యాలయ టెక్నికల్ గోవర్దన్, మండల వ్యవసాయ అధికారి జి.నాగలక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కడప రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మానసిక రోగుల కోసం ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం రిమ్స్ ఆవరణలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ కేంద్రాన్ని విజిట్ చేసి న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మానసిక రోగులు మందులను సకాలంలో వాడి వ్యాధి తీవ్రతను తగ్గించుకోవాలన్నారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ మానసిక అనారోగ్యం ఉన్న వ్యక్తులు, మేధో వైకల్యాలున్న వ్యక్తులకు చట్టపరమైన సేవల పథకం 2024, మానసిక ఆరోగ్యం సంరక్షణ చట్టం 2017, జాతీయ మానసిక ఆరోగ్య విధానం 2014 తదితర వాటి గురించి తెలియజేశారు.

అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశం

న్యాయసేవాసదన్‌లో మంగళవారం అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు. జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్ నేతృత్వంలో కమిటీ అధికారులు సెక్షన్ 436ఏ సీఆర్‌పీసీ, 479 బీఎన్ఎస్ఎస్ అర్హత కలిగిన యూటీపీల గురించి, హైకోర్టు ద్వారా బెయిల్ మంజూరైన యూటీపీల గురించి చర్చించారు.
కార్యక్రమాలలో కడప అడిషనల్ ఎస్పీ, కడప డీఆర్‌వో, రాయచోటి రెవెన్యూ డివిజనల్ అధికారి, పురుషుల, మహిళల కేంద్ర కారాగారాల సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం



టీడీపీ సాధికారత కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న షాజహాన్‌బాషా

నిమ్మనపల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం అని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. మంగళవారం స్థానిక వారప ుసంతలో మహిళా సంఘాల సభ్యులకు కుటుమిషన్ శిక్షణ తరగతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన 9 నెలల్లో దాదాపు ప్రతి గ్రామంలోనూ సీసీ రోడ్లు నిర్మించామని తెలిపారు. నిమ్మనపల్లి-కందూరు రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అనం తరం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో గ్రామ సాధికారత కమిటీ ఏర్పాటుకు సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామ పంచాయతీలో స్థానికంగా ఉండి, టీడీపీలో క్రియాశీలకంగా పని చేసేందుకు ఉత్సాహవంతులైన టీడీపీ నాయకులు తమ పేర్లను తెలపాలన్నారు. పది గ్రా పంచాయతీలకు సాధికారత కమిటీలు పూర్తి అయిన తరువాత మండల కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు ఈ కమిటీలన్నీ వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఈనెల 28న జరగబోయే మహానాడు నాటికి అన్ని కమిటీలు పూర్తి కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అమరనాథ్, ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి, ఏపీఎం మురళి, నాయకులు వెంకటరమణ, ఆర్టే వెంకటేష్, రెడ్డెప్పరెడ్డి, రాజన్న, విజయ్, మల్లప్ప, మహమ్మద్‌రఫి, శ్రీపతి, జయన్న, కల్యాణ్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచించారు. మంగళవారం రాత్రి తన నివాసం వద్ద మదనపల్లె మండలం, అర్బన్ ప్రాంతాలకు చెందిన టీడీపీ సాధికార సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి 30 ఇళ్లకు ఒక సాధికార కమిటీ సభ్యుడిని ఎంపిక చేయాలన్నారు. ఈ సభ్యులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించాలన్నారు. అలాగే ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి తమ ద్వారా పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు మోడెం సిద్దప్ప, ఎస్ఎం రఫి, ఫణికర్‌రెడ్డి, కత్తి లక్ష్మన్న, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు స్థానికంగానే పని కల్పించాలి

● ఉపాధి హామీ పీడీ వెంకటరత్నం



గ్యారంపల్లె వద్ద ఉపాధి పనులను పర్యవేక్షిస్తున్న పీడీ వెంకటరత్నం

పీలేరు రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా స్థానికంగానే ఉపాధి పనులు చూపించాలని అన్నమయ్య జిల్లా పథక సంచాలకులు వెంకటరత్నం తెలిపారు. మంగళవారం కేవీపల్లె మండలం గ్యారంపల్లె వద్ద ఉపాధి పనులను అకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి కూలీకి విధిగా వంద రోజులు ఉపాధి పనులు చూపించాలన్నారు. ఎవరైనా స్థానికంగా ఉపాధి లేదని ఇతర ప్రాంతాలకు వలస వెళితే సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గత సంవత్సరం కూలీలకు దినసరి కూలీ రూ. 300 వచ్చేదని, ప్రస్తుతం ప్రభుత్వం రోజువారి కూలీ 307కు పెంచినట్లు చెప్పారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని కూలీలకు పనుల వద్ద తాగునీరు, నీడ కల్పించాలని ఆదేశించారు. ఉద్యాన పంటలు సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు కల్పించిందని, ఆసక్తి గల రైతులు ఏపీడీలను కలసి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పనుల కల్పనపై కూలీలతో ఆరా తీశారు.

కూలి పెరిగేలా పని కల్పించండి

కలకడ: జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి దినసరి కూలి పెరిగేలా సిబ్బంది పని చేయాలని డ్వామా పీడీ వెంకటరత్నం ఆదేశించారు. మంగళవారం కలకడలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని పంచాయితీల్లో పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి వారం లక్ష్యం మేరకు ఫారంపాండ్స్ పనుల్లో ప్రగతి సాధించాలన్నారు. దినసరి కూలి రూ.307కు పెంచడంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ మధుబాబు, ఎంపీడీవో అబ్దుల్‌రహీం, ఏపీవో సుజాత సిబ్బంది పాల్గొన్నారు.

కోరినంత గడువు ఇచ్చాం.. ఆక్రమణలు తొలగించాల్సిందే!

● పంచాయతీ ఈవో రవీంద్రనాథ్



ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆక్రమణలు తొలగిస్తున్న పంచాయతీ అధికారులు

వాల్మీకిపురం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో పంచాయతీ స్థలాలు, డ్రైనేజీపై అక్రమ కట్టడాలు, ఆక్రమణల తొలగింపు పనులను మంగళ వారం సాయంత్రం పంచాయతీ అధికారులు ప్రారంభించారు. నెలన్నర ముందే ఆక్రమణ దారులకు నోటీసులు జారీ చేసినా, ఇప్పటి దాకా ఆక్రమణలు తొలగించకపోవడం సరికాదని పంచాయతీ ఈవో రవీంద్రనాథ్ తెలిపారు. స్థానిక ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పంచాయ తీ అధికారులు, పోలీసులు బందోబస్తు నడుమ అక్రమ నిర్మాణాల తొలగింపు ప్రారంభించారు. అయితే, మరో 24 గంటలు గడువు ఇస్తే తామే స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగిస్తామని కొందరు దుకాణదారులు చెప్పడంతో పంచాయతీ ఈవో ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె విద్యార్థికి గిన్నిస్ అవార్డు



జైత్రమాధుర్‌ను అభినందిస్తున్న గురుప్రసాద్

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక జ్ఞానాంబిక జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థి జైత్ర మాధుర్‌కు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ లో స్థానం దక్కింది. శాస్త్రీయ నృత్యం నేర్చుకున్న జైత్రమాధుర్ 2023 డిసెంబర్‌లో హైదరాబాద్‌లోని గచ్చిబౌలీ స్టేడియంలో 4,218 మంది పాల్గొన్న శాస్త్రీయనృత్య ప్రదర్శనలో జైత్ర పాల్గొన్నాడు. ఇందుకు సంబంధించిన అవార్డును హైదరాబాద్‌లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు డాన్స్ మాస్టర్ బాలాజీ ద్వారా జైత్రమాధుర్‌కు అందజేశారు. విద్యాసంస్థల కరెస్పాండెట్ ఆర్.గురు ప్రసాద్, ప్రిన్సిపాల్స్ రమాదేవి, వెంకటాచలపతి, డాన్స్‌మాస్టర్ బాలాజీ విద్యార్థిని అభినందించారు.

గుండెపోటుతో వీఆర్వో మృతి



అన్వరుల్లా భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలంలో వీఆర్వోగా పనిచేస్తున్న అన్వరుల్లా (55) గుండెపోటుకు గురై మరణించారు. మండలంలోని గుట్టపాలేనికి చెందిన అన్వరుల్లా పూతలపట్టులో విధులు నిర్వహిస్తుంటాడు. మంగళవారం వేకువ జామున హఠాత్తుగా గుండె పోటుకు గురయ్యాడు. వెంటనే కలికిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి గుట్టపాళెం మాజీ సర్పంచు కేవీ రెడ్డితో కలిసి అన్వరుల్లా భౌతిక కాయాన్ని సం దర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

యువ నాయకుడు గాంధీ రెడ్డి హఠాన్మరణం



వాల్మీకిపురం/మదనపల్లె టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): యువ నాయకుడు ఓబుళం పల్లె గాంధీ రెడ్డి(52) మంగళవారం కన్నుమూశారు. మదనపల్లెలోని సమీప బంధువు ఇంటికి వెళ్లిన సందర్భంగా ఆయన అకస్మాత్తుగా గుండె పోటుకు గురై కుప్పకూలిపోయారు. గాంధీ రెడ్డి రెండు దశాబ్దాల క్రితం వాల్మీకిపురం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా పని చేశారు. చిరు ప్రాయం నుంచే రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనే ఆయన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సమీప బంధువు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రముఖులతో సన్నిహితంగా ఉండేవారు. గాంధీ రెడ్డి మృతి పట్ల ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, వైసీపీ నాయకులు హరీశ్ రెడ్డి, నల్లారి శ్రీకర్ రెడ్డి, అబ్దుల్ కలీమ్, మొగ్రంరెడ్డి రామ్ కుమార్ రెడ్డి, పులి నరేంద్రకుమార్ రెడ్డి తదితరులు సం తాపం వ్యక్తం చేశారు. గాంధీ రెడ్డి మృతి పట్ల రాజేంద్రాచారి, వలిగట్ల రమణ ప్రగాఢ సంతాపం తెలియజేశారు


ఘనంగా టీడీపీ నాయకుల జన్మదిన వేడుకలు



గురుప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సేతు, బీజేపీ నాయకులు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):స్థానిక టీడీపీ నాయకులు కంచెర్ల శ్రీనివాసులునాయుడు, రాటకొండ గురుప్రసాద్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో టీడీపీ నేత, కళాశాల కరస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్‌ను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, బీజేపీ జాతీయ నాయకుడు చల్లపల్లె నరసింహారెడ్డి, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికారప్రతినిధి మార్పూరి రమేశ్, శ్వేతన్ ఆధ్వర్యంలో స్థానిక కూరపర్తి అనాథాశ్రమంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో విజయభారతి హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎన్.సేతు, కురవంక సర్పంచ్ చిప్పిలి చలపతి, బీవైఎస్ అధ్యక్షుడు పునీత్, బహుజన సేన అధ్యక్షుడు శ్రీచందు, బీజేపీ నాయకులు అజంతుల్లా, బర్నేపల్లె రవికుమార్, స్థాని కులు సతీష్ పాల్గొన్నారు. స్థానిక ఎన్‌వీఆర్ కళ్యాణమండపంలో టీడీపీ నాయ కుడు, మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు కంచర్ల శ్రీని వాసులు నాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. టౌన్‌బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, టీడీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

మదనపల్లె డీఎస్పీని కలిసిన దొరస్వామినాయుడు



డీఎస్పీని కలిసిన దొరస్వామినాయుడు

ములకలచెరువు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): డీఎస్పీ మహేంద్రను టీఎస్ ఎన్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత కట్టా దొరస్వామినాయుడు మంగళ వారం కలిశారు. ఇటీవల మదనపల్లె డీఎస్పీగా మహేంద్ర బాధ్యతలు స్వీకరించడంతో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణకు సహాయ, సహకారాలు అందిం చాలని డీఎస్పీ సూచించారు.

మదనపల్లె అర్బన్: అసెంబ్లీ కన్వీనర్ భగవాన్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు డీఎస్పీని సన్మానించారు. జబ్బల శ్రీనివాసులు, భువనేశ్వర్ సత్య, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొజ్జప్ప, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో టౌన్‌బ్యాంకు మాజీ సీఈవో మృతి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మదన పల్లె టౌన్‌బ్యాంకు మాజీ సీఈవో కోసూరి రామ్మూర్తి అనారోగ్యంతో మృతి చెందారు. కొన్ని రోజులుగా బెంగళూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికి త్స పొందు తున్న ఆయన పరిస్థితి విషమించడంతో మంగళ వారం మృతి చెందారు. వైసీపీ ఇన్‌చార్జి నిస్సార్ అహ్మద్, బలిజ సంఘం నాయకులు నివాళుల ర్పించారు.లయన్స్‌క్లబ్ కంటి వైద్య

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

కురబలకోట, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీపీ భూదేవి, ఎంపీడీవో గంగయ్య తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపీటీసీ సభ్యుడు వైజీ సురేంద్ర మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తపస్విని, ఎంపీటీసీ సభ్యులు వెంకటరమణారెడ్డి, రవీంద్రరెడ్డి, సర్పంచ్‌లు పోరెడ్డి విశ్వనాథరెడ్డి, అమరావతమ్మ, ట్రాన్స్‌కో ఏఈ శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

60 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

బి.కొత్తకోట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ మదనపల్లి, లయన్స్‌క్లబ్ ఆఫ్ హార్సిలీహిల్స్ బి.కొత్తకోట పట్టణంలో మంగళవారం నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 60మందికి వైద్యుడు అనిల్ పరీక్షలు నిర్వహించారు. 25 మందిని శస్త్రచికిత్సకు ఎంపికచేశారు.కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు లయన్ కె.మోహన్‌రెడ్డి, శ్రవణ్‌రెడ్డి, ఎన్.కృష్ణారెడ్డి, పీఆర్‌వో చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అంబేడ్కర్ శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న అభిమానులు

మదనపల్లె, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరి హృదయాలలో నిలిచిపోయాడని బాస్ వ్యవస్థాపకుడు పీటీఎం శివప్రసాద్ అన్నారు. సోమవారం రాత్రి మదనపల్లె పట్టణంలో అంబేడ్కర్ శోభాయాత్ర వైభవోపేతంగా నిర్వహించారు. పట్టణంలోని మిషన్ కాంపౌండ్ వద్ద దళిత సంఘర్షణ సమితి(డిఎస్ఎస్) కర్నాటక రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేష్ దంపతులు జెండా ఊపి శోభాయాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో బాస్ నాయకులు నీరుగట్టి రమణ, టీపీ పీర్‌బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి చాట్ల బయన్న, రాష్ట్ర గిరిజన సమాఖ్య అధ్యక్షుడు దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం



పీలేరు: అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పీలేరు రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాలపై అప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీలేరు అగ్నిమాపక అధికారి ఎస్. మస్తాన్ తెలిపారు. మంగళవారం పీలేరు ఆర్టీసీ బస్‌స్టేషన్ సముదాయం వద్ద అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు సంభవించినపుడు వాటిని ఎలా అదుపు చేయాలి, ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించారు. వేసవి కాలంలో తరచూ అగ్నిప్రమాదాలు సంభవిస్తుంటాయని, అలాంటి సమయంలో ప్రాణ, ఆస్తినష్టం సంభవించకుండా ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు మంటలను అదుపుచేసే విధానాలను అగ్నిమాపక సిబ్బంది ప్రదర్శించారు. అనంతరం ప్రయాణికులు, ఉద్యోగులు, వ్యాపారులకు కరపత్రాలు అందచేశారు.

వాల్మీకిపురం : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఫైర్ సిబ్బంది అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఫైర్ స్టేషన్ అధికారి బాబయ్య, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, ఫైర్ సిబ్బంది కిరణ్‌కుమార్, శ్రీనివాసులు, రాజగోపాల్‌నాయక్, మురళి, మోహన్‌నాయక్, కిరణ్‌బాబు, వెంకటరమణ, రవి, ఇమ్రాన్, బలరాంనాయక్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్: అగ్నిమాపక అధికారి శివప్ప ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిత్తూరు బాస్టండ్, నిమ్మనపల్లె సర్కిల్, ఎన్‌వీఆర్ లేవుట్, మోతీనగర్‌ల్లో ప్రజలకు శివటాయ్స్ అపార్ట్‌మెంట్‌లో అగ్నిమాపక సిబ్బంది విన్యాసాలు చేసి అవగాహన కల్పించారు. ఎంటువంటి అగ్నిప్రమాదాలు జరిగినా 101, 08571-222101కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

మసీదుల్లో బాల్య వివాహాలు అరికట్టండి



తహసీల్దారుకు విన్నవిస్తున్న సర్‌ఖాజీ నవాజుద్దీన్

పీలేరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మసీదుల్లో బాల్య వివాహాలు చేయకుండా కట్టడి చేయాలని పీలేరు మండల సర్ ఖాజీ కె.ఎస్.నవాజుద్దీన్ తహసీల్దారు భీమేశ్వర రావుకు విజ్ఞప్తి చేశారు. పీలేరు మండలంలోని పలు మసీదుల్లో ఇటీవలి కాలంలో మైనర్ బాలికలకు నిఖా చేసినట్లు తన దృష్టికి వచ్చిందని సర్‌ఖాజీ తెలిపారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా మైనర్ బాలికలకు నిఖా చేయడంతో పలు అనర్థాలు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నియమితులైన నయాజ్ ఖాజీల ద్వారా మాత్రమే నిఖా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన తహసీల్దారు మండలంలోని అన్ని మసీదుల ముతవల్లీలకు ప్రభుత్వ సర్‌ఖాజీ అనుమతి, సమాచారం లేకుండా నిఖా జరిపించకూడదని ఆదేశాలు జారీ చేశారు.

20న ఆయుర్వేద వైద్యంపై అవగాహన శిబిరం

ములకలచెరువు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డులో ఈ నెల 20వ తేదీన పారంపర్య వైద్య సంఘం అధ్వ ర్యంలో ఆయుర్వేద వైద్యంపై అవ గాహన, చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యుడు హకీం ఎన్ఎస్ఎండీ ముక్తియార్ తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో మంగళవారం శిబిరానికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరంలో తిరుపతి శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేద వైద్య పాకశాల విశ్రాంత వైద్యులు బులుసు సీతారాం, ఔషధ తయారీశాల నిపుణులు బాబు రాజేంద్రప్రసాద్, రాష్ట్ర ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ చైర్మన్ భానుప్రకాష్ తదితరులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సంఘం వైస్ చైర్మన్ షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నీటి తొట్టెల పనులు పూర్తి చేయాలి



నీటి తొట్టెలను పరిశీలిస్తున్న ఎంపీడీవో హరినారాయణ

ములకలచెరువు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన నీటి తొట్టెల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో హరి నారాయణ ఆదేశించారు. మండలంలోని వేపూరికోట పంచాయతీ చీకుచెట్టుపల్లెలో నిర్మించిన పశువుల నీటి తొట్టెను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా పశువులు, గొర్రెలు, మేకల దాహార్తి తీర్చేందుకు మండలంలో 42 నీటి తొట్టెల నిర్మాణం చేపట్టామన్నారు. నీటి తొట్టెల నిర్మాణం పూర్తయిన చోట కచ్చితంగా ప్రతి రోజూ నీరు నింపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో నారాయణస్వామి, మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, నాయకులు అంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం



విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న నాయకులు

తంబళ్లపల్లె,ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాల మహానాడు అధ్యక్షుడు సలాది రాజశేఖర్, టీడీపీ బీసీ నాయకుడు మాదారపు చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక పాత కళాశాల మైదానంలో సలాది రాజశేఖర్, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్ర పటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మల్లయ్యకొండ ఆలయ మాజీ చైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి సహకారంతో ప్రభుత్వ ఐటీఐ, ఎంపీపీ పాఠశాలలో చదువుతున్న సుమారు 200 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అంగన్వాడీ చిన్నారులకు పలక, పెన్సిల్, బలపం పంపిణీ చేశారు. పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. వృద్ధులకు పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ మణి, ఎస్ఎంసీ చైర్మన్ శివ, బాలల హక్కుల కన్వీనర్ నరసింహులు, దళిత నాయకుడు రెడ్డప్ప, తుకారం, పీర్లమాబు, అమర్‌నాథ్, కన్నా తదితరులు పాల్గొన్నారు.

నిరాధార వృద్ధులకు చేయూతనివ్వండి



అన్నదానం చేస్తున్న ఆనంద్‌కుమార్

వాల్మీకిపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నిరాశ్రయులైన వృద్ధులకు ప్రతి ఒక్కరూ చేయూతనిచ్చి ఆదుకోవాలని వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం తన తండ్రి గుర్రప్ప వర్ధంతి సందర్భంగా స్థానిక చౌడేశ్వరిదేవి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, రొట్టెల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో సేవా భావం పెంపొందించుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో దాతల కుటుంబీకులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

'సమన్వయంతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందాం'



గ్రామసభలో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి ప్రమీల

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని మల్లెల సర్పంచ్ శ్రీకంఠరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రమీలా పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సచివాలయంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులతో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ శ్రీకంఠరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రమీల మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోవడంతో గ్రామాలు అస్తవ్యస్తంగా తయారయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లో అభివృద్ధికి అడుగులు పడుతు న్నాయన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో మంజూరైన నిధులతో స్వచ్ఛ గ్రామ పంచాయతీలుగా తీర్చి దిద్దుకోవాలన్నారు. నెలవంక హరి, కుందిలి వెంకటరెడ్డి, రామకృష్ణారెడ్డి, మునిరెడ్డి, మల్లెల రవి, నరసింహులు, సుబ్బిరెడ్డి పాల్గొన్నారు.

'మత సామరస్యాన్ని దెబ్బ తీయడానికే వక్ఫ్ బిల్లు'

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మత సామరస్యాన్ని దెబ్బ తీయడానికే వక్ఫ్ బిల్లు సవరణ చేశారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కే బాషా అన్నారు. మంగళవారం మదనపల్లెలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు అతీతంగా భారతీయులంతా అన్నదమ్ముల్లా కలిసి ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల గడిచిన తరువాత కూడా కులం పేరిట ప్రజలను విభజించడం సమంజసం కాదన్నారు. అలాంటి వాటిని ఎవ్వరూ ప్రోత్సహించరాదన్నారు. దేశంలో ముస్లిలు కూడా భారతీయులే అన్నారు. కుల రాజకీయాలకు స్వస్తి పలకాలని ఆయన హితవు పలికారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కలికిరి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): 2025-26 సంవత్సరానికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో భానుమూర్తి రావు ఒక ప్రకటనలో కోరారు. మే నెల 10వ తేదీలోగా అవసరమైన యూనిట్లను ఎంచుకుని ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పంపుకోవాలని చెప్పారు. దారిద్ర్య రేఖకు దిగువన వున్న 21 నుంచి 50 ఏళ్ల మధ్య వయసున్న అభ్యర్థులు మీ సేవ ద్వారా దరఖాస్తులు పంపుకుని, నమోదు చేసిన దరఖాస్తుల కాపీలను మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో అందజేయాలని కోరారు.

మదనపల్లె పీఏసీఎస్‌కు కొత్త పర్సన్ ఇన్‌చార్జి

కలికిరి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి (పీఏసీఎస్) కొత్త పర్సన్ ఇన్‌చార్జిని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మదనపల్లె సబ్ డివిజనల్ కోఆపరేటివ్ కార్యాలయం (ఎస్‌డీఎల్‌సీవో)లో సీనియర్ ఇన్‌స్పెక్టరుగా పరిచేస్తున్న సి.రఘునాథ రెడ్డిని అధికారిక పర్సన్ ఇన్‌చార్జిగా నియమించారు. ఎన్నికల వరకూగానీ లేదా తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకూ గానీ ఆయన ఈ పదవిలో కొనసాగాలని వ్యవసాయ, సహకార శాఖ ఎక్స్‌అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.